ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
శనివారం 20 జూన్ 2026 సంపుటి:1 సంచిక: 3 పేజీలు:12 వెల: 4
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad


## ఇటలీ ఎన్నటికీ యాచించదు



ట్రంప్ వ్యాఖ్యలకు మెలోనీ కౌంటర్ 2

## ప్రపంచమంతా భారత 'యువశక్తి' గురించే చర్చ

ప్రధాని మోడీ



ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' కింద 2,400 కోట్ల నిధులు విడుదల 2



## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం అనుమతి

అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ

- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

**హైదరాబాద్,జూన్ 19 (విశాల తెలంగాణ):**

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ..మిగతా 2లో

## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్‌కు కోర్టు సమన్లు



**హైదరాబాద్, జూన్19 (సింగిడి)**

సంధ్య థియేటర్ ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. సోమవారం విచారణకు హాజరు కావాలని పేర్కొంది. 2

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత
- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



**"దేశ భవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోను కాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు.**

**హైదరాబాద్, జూన్19 (సింగిడి)**

అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. 2




## పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

వాట్సాప్ ద్వారా నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం 2



## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు

సుప్రీం కోర్టు 2



## గండిపేట భూకబ్జా కేసు బ్రహ్మనాయుడికి బెయిల్

2

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్



కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు

మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ 2

## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి



బాయిబాటకు శ్రీధర్ బాబు ఆటంకాలు

- నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

**పెద్దపల్లి,జూన్ 19 (సింగిడి)**

'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతా మన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి ..మిగతా 2లో

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు?

కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాస ఘాతక ప్రభుత్వం

- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
- రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు



**సిద్దిపేట,జూన్ 19 (సింగిడి)**

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. 2

## సీఎం చంద్రబాబుతో సాయికృష్ణ తల్లి భేటీ

కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన విజయలక్ష్మి



- సాయికృష్ణ అదృశ్యంపై విచారణ జరుగుతోందన్న సిఎం
- ఎంతటి వారినైనా వదలబోమని చంద్రబాబు హామీ
- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

2

## తెలంగాణపై పవన్ ఫోకస్

మణికొండలో జనసేన కొత్త ఆఫీస్



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయం స్ఫూర్తితో జనసేన పార్టీ తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించే దిశగా కీలక అడుగు వేసింది. పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్ లోని మణికొండలో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**హైదరాబాద్, జూన్19 (సింగిడి)**

## అమెరికా-ఇరాన్ కీలక శాంతి చర్చలు రద్దు

చివరి నిమిషంలో బిగ్ ట్విస్ట్..



అమెరికా, ఇరాన్ యుద్ధం ముగింపు ప్రకటనతో సంతోషంలో ఉన్న ప్రపంచ దేశాలకు ఊహించని షాక్ తగిలింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నేడు జరగాల్సిన కీలకమైన శాంతి చర్చల్లో బిగ్ ట్విస్ట్ నెలకొంది. 2



## నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

ఢీకొన్న రెండు కార్లు... ముగ్గురు మృతి..

మృతుల్లో తండ్రీ కొడుకులు

**నల్లగొండ,జూన్ 19 (సింగిడి)**

నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స ..మిగతా 2లో

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 20-6-2026

## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి...

మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఉద్యోగులకు సౌకర్యాలు, సరైన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో క్వాలిటీ యంత్రాలు లేవు.. వారి భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని ఎండగడుతూ ఆమె వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుపై ఆమె చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సింగరేణి కార్మికుల క్షేమమే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన కవిత.. ప్రస్తుతం సింగరేణిలో కార్మికులకు కనీస నాణ్యత కలిగిన యంత్రాలు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే బొగ్గు గని కార్మికుల భద్రతను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావే కాపాడుతున్నారు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తాము సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తుంటే మంత్రి శ్రీధర్ బాబు కావాలనే తమ పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకుంటూ, ఈ వ్యవహారం ద్వారా శ్రీధర్ బాబు రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

హైదరాబాద్,జూన్ 19 (సింగిడి)

రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## గండిపేట భూకబ్జా కేసు బ్రహ్మానాయుడికి బెయిల్

హైదరాబాద్,జూన్ 19 (సింగిడి)

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మానాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మానాయుడు తరపు న్యాయవాదులు వాదించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేకు రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

మొదటి పేజీ తరువాయి...

గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం అనుమతి

మొదటి పేజీ తరువాయి...

ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

న్యూఢిల్లీ,జూన్ 19 (సింగిడి)

నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎమ్ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు: సుప్రీం కోర్టు

పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిర్దేశించిన ఫుట్‌పాత్‌పై నడవడం పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. వాహనాల రాకపోకల కన్నా ఫుట్‌పాత్‌లపై నడిచే వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూకర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. రహదారులు ఉన్నచోట కాలిబాటను గుర్తించి.. మౌలిక సదుపాయాల కల్పన, వాటి నిర్వహణ చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలపై ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన కాలిబాటలు లేకపోవడం, ఒకవేళ అవి ఉన్నప్పటికీ వాహనాలు వాటిని ఆక్రమించుకోవడం అనేది ఓ నాగరికత సమస్యగానే మిగిలిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. సురక్షితంగా నడిచే హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు.. నష్ట పరిహారం కోసం సంబంధిత విభాగాలపై న్యాయపరంగా చర్యలు తీసుకునే హక్కు పౌరులకు ఉందని స్పష్టం చేసింది. కొంతకాలం క్రితం తండ్రితో కలిసి ఓ బాలుడు పాఠశాలకు వెళ్తుండగా వెనుక నుంచి ఓ లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పాదచారుల మార్గంలో లోపాలున్నాయని, పరిహారం అందించాలని కోరుతూ బాలుడి తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరిహారం చెల్లింపు అంశం సుప్రీం కోర్టుకు చేరడంతో ఈ కేసును విచారించిన ధర్మాసనం.. పాదచారుల భద్రతపై కీలక తీర్పు ఇచ్చింది. అంతేకాదు, మృతిచెందిన బాలుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.11,44,628కి పెంచుతూ.. రెండు నెలల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది.

## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్‌కు కోర్టు సమన్లు

ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 నిందితుడిగా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. సంధ్య థియేటర్ ఘటనలో ఇప్పటి వరకు 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. నిందితుల వ్యక్తిగత హాజరు తర్వాత కేసు విచారణ ప్రారంభం కానుంది.

## నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

## అమెరికా-ఇరాన్ కీలక శాంతి చర్చలు రద్దు

వివిధ కారణాలతో ఈ సమావేశం హఠాత్తుగా రద్దయ్యాయి. ఈ చర్చల కోసం వెళ్లాల్సిన అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తన స్విట్జర్లాండ్ పర్యటనను సైతం రద్దు చేసుకున్నారు. అయితే, చర్చలు నిలిచిపోవడానికి గల కారణాలపై అమెరికా వైట్‌హౌస్, ఇరాన్ మీడియా భిన్నమైన వెర్షన్లను వినిపిస్తున్నాయి. స్విట్జర్లాండ్‌లో భద్రత, నిర్వహణ సంబంధిత ఏర్పాట్లలో తలెత్తిన సమస్యల వల్లే ఈ పర్యటన, చర్చలు రద్దయ్యాయని అమెరికా అధికారిక నివాసం వైట్‌హౌస్ ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా మాత్రం ఇందుకు భిన్నమైన కారణాన్ని వెల్లడించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరాయంగా జరుపుతున్న దాడుల కారణంగానే ఈ శాంతి చర్చలు నిలిచిపోయాయని ఇరాన్ మీడియా స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇస్తున్న నేపథ్యంలోనే ఈ ప్రతిష్ఠంభన ఏర్పడినట్లు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరిన తరుణంలో, ఇరు దేశాల మధ్య జరగాల్సిన ఈ శాంతి చర్చలు రద్దు కావడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

## సీఎం చంద్రబాబుతో సాయికృష్ణ తల్లి భేటీ

అమరావతి,జూన్19 (సింగిడి)

విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం కలిశారు. సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని సాయికృష్ణ తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోవన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన తెలిపారు.

### ప్రపంచమంతా భారత 'యువశక్తి' గురించే చర్చ

ఢిల్లీ, జూన్19 (సింగిడి)

యావత్ ప్రపంచం మొత్తం భారత దేశంలోని యువశక్తి గురించే చర్చిస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ వేదికగా 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' కింద లబ్ధిదారులకు ₹2,400 కోట్ల నిధులను విడుదల చేశారు. అనంతరం ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. నిధులను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ప్రముఖ నేతలంతా నేడు భారతదేశ 'యువశక్తి' మరియు వారి అసాధారణ సామర్థ్యం గురించే చర్చిస్తున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 70 లక్షల (7 మిలియన్) కొత్త ఉద్యోగాలు సృష్టించబడి, తొలిసారి ఉద్యోగాల్లో చేరిన యువతకు సామాజిక భద్రత లభించిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. ఉద్యోగంలో చేరి ఆరు నెలలు పూర్తి చేసుకున్న 10 లక్షల (1 మిలియన్) మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి ₹2,000 కోట్లకు పైగా నగదును నేరుగా బదిలీ చేశామని, ఈ మొత్తం వారి కష్టానికి లభించిన ప్రభుత్వ గుర్తింపు అని కొనియాడారు.

### ఇటలీ ఎన్నటికీ యాచించదు

ట్రంప్ వ్యాఖ్యలకు మెలోనీ కౌంటర్

ఢిల్లీ, జూన్19 (సింగిడి)

ఇటీవల ఫ్రాన్స్ వేదికగా జరిగిన జీ 7 దేశాల శిఖరాగ్ర సమావేశానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఫోటో దిగారు. అయితే, తనను ఫోటో కోసం మెలోనీ అడుక్కుందని ట్రంప్ ఇటలీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యలపై మెలోనీ స్పందిస్తూ.. ట్రంప్‌నకు మతిభ్రమించిందని మండిపడ్డారు. తాను ఆయనతో ఫోటో కోసం అడుక్కోలేదని స్పష్టం చేశారు.

### కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు?

మొదటి పేజీ తరువాయి...

పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

# 'మగువ' సారథిగా అర్చన

## లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండంకు కొత్త నాయకత్వం

## సమాజ సేవ.. మహిళా సాధికారతే మా ధ్యేయం : అర్చన అంబటి

## ఘనంగా 6వ ఇన్‌స్టాలేషన్ వేడుక







**రామగుండం, జూన్ 19 (సింగిడి):** సమాజాభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యాల సాధనకు మహిళలు ముందుండాలని పిలుపునిస్తూ లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం--మగువ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. గురువారం సాయంత్రం హోటల్ శ్రీమయి గ్రాండ్‌లో నిర్వహించిన 6వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలిగా అర్చన--సంతోష్ రావు అంబటి బాధ్యతలు చేపట్టగా, కార్యదర్శిగా ఎతిరాజ్ భవాని, కోశాధికారిణిగా స్వరూప పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫస్ట్ గవర్నర్ చంద్ర ప్రకాష్ హాజరయ్యారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రీజియన్ చైర్‌పర్సన్ సోమారపు లావణ్య, జోన్ చైర్‌పర్సన్ లక్ష్మీవాణి, కృష్ణహరి, ఆనందం కొల్లూరి, బంకా రామస్వామి, బీనా సింగ్, సూర్యదేవర జ్యోతి, గాలి సునీత తదితరులు పాల్గొని నూతన బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు అర్చన అంబటి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆశయాలకు అనుగుణంగా మహిళా సాధికారత, విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణతో పాటు నిరుపేదలకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. క్లబ్ సభ్యుల సమిష్టి సహకారంతో సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలు, సభ్యుల మద్దతుతో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం--మగువను సేవా రంగంలో ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంలోని అన్ని వర్గాలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# తాగి నడిపితే జైలు ఖాయం..!

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

## ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 6 మంది పట్టివేత.

## ఒకరికి 7 రోజుల జైలు - ఐదుగురికి రూ.55 వేల జరిమానా

**గోదావరిఖని, జూన్ 19 (సింగిడి):** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రామగుండం ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నమోదైన కేసులకు సంబంధించి నిందితులను గోదావరిఖని ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. కోర్టు విచారణ అనంతరం ఐదుగురు నిందితులకు మొత్తం రూ.55 వేల జరిమానా విధించగా, మరో వ్యక్తికి 7 రోజుల జైలు శిక్ష విధించింది. శిక్షపడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణాలు, నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల పాటన ద్వారానే ప్రమాదాలను నివారించి సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ

# జన్మదిన వేడుకలు

### రామగుండంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు.

### ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న నేత రాహుల్ గాంధీ.

### అయోధ్య సింగ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**గోదావరిఖని జూన్ 19 (సింగిడి):** రామగుండం పట్టణంలో ఏఐసీసీ జాతీయ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి.

ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఠాకూర్ అయోధ్య సింగ్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**రాజ్యాంగ విలువల పరిరక్షణే రాహుల్ గాంధీ లక్ష్యం**

దేశ ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందేలా చేయడమే రాహుల్ గాంధీ సంకల్పమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తున్నారని అయోధ్య సింగ్ అన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన నాయకత్వం కొనసాగుతోందని కొనియాడారు.



**కాంగ్రెస్ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలి**

రాహుల్ గాంధీ ఆశయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రామగుండం పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, మహిళా విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్లూరుకు అండగా మేయర్ స్వామి

## యైటింక్లయిన్ కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దే దిశగా వేగవంతమైన చర్యలు

## కాలువల పూడిక తొలగింపు.. శ్రమదానంతో పరిశుభ్రత ఉద్యమం



**గోదావరిఖని, జూన్ 19 (సింగిడి):** రామగుండం నగరాన్ని స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 19వ డివిజన్ అల్లూరు ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

**ప్రధాన కాలువకు జీవం.. నీటి ప్రవాహానికి మార్గం సుగమం**

స్థానిక కార్పొరేటర్ మారెల్లి సుశీలా రాజిరెడ్డి సూచించిన సమస్యలపై స్పందించిన మేయర్, పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికను యంత్రాల సహాయంతో తొలగింపజేశారు. దీంతో నీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డంకులు తొలగి వరద ముప్పు తగ్గే అవకాశముందని తెలిపారు.

**ఐదు డివిజన్ల వరద సమస్యకు శాశ్వత పరిష్కారం**

ప్రజలు, నాయకులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి మేయర్ స్వయంగా శ్రమదానంలో పాల్గొన్నారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త, రాళ్లు, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల ఆక్రమణలు, పూడిక కారణంగా ఐదు డివిజన్లు వరద ముప్పును ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ, శాశ్వత పరిష్కారంగా కాంక్రీట్ వరద కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**మంచినీటి అవసరాలకు కొత్త జలాశయం**

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలనీలో మరో ఉపరితల జలాశయం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించామని మేయర్ తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదు**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎలాంటి అవరోధాలు నిలువరించలేవని మేయర్ స్పష్టం చేశారు. నగర అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి**

అనంతరం అల్లూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన మేయర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. సమయపాలనతో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఎస్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, మెప్మా సీఓ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి తీరాన 'దక్షిణకాశి' వైభవం

## 2027 పుష్కరాల సవాళ్లు - సన్నద్ధత

### కేసీఆర్ స్వర్ణకంకణ మొక్కుల నుంచి రేవంత్ సర్కార్ మాస్టర్ ప్లాన్ దాకా: ధర్మపురి పుష్కర ప్రస్థానం

**గోదావరి పుష్కరాలు అనగానే సాధారణంగా అందరి మదిలోనూ మెదిలే మొదటి పేరు రాజమహేంద్రవరం. అయితే, అంతటి ప్రాచీన పౌరాణిక వైభవం, చారిత్రక నేపథ్యం ఉన్న గోదావరి నదీ తీర సంస్కృతి కేవలం ఆంధ్ర ప్రాంతానికే పరిమితం కాలేదు. సహస్రాబ్దాల ఆధ్యాత్మిక వారసత్వాన్ని తన గర్భంలో దాచుకున్న తెలంగాణలోని గోదావరి తీర క్షేత్రాలు కూడా పుష్కరాల సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన, సమానమైన ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. ఈ సుదీర్ఘ నదీ పరివాహక ప్రాంతంలో 'దక్షిణకాశి'గా, వైష్ణవ-శైవ సంప్రదాయాల సంగమ క్షేత్రంగా విరాజిల్లుతున్న జగత్ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి. జగజ్జనకుడు బ్రహ్మదేవుడు, లక్ష్మీసమేతుడైన నరసింహస్వామి, యమధర్మరాజు, శివుడు ఒకేచోట కొలువై ఉన్న త్రిమూర్తి సాన్నిధ్య వైభవం, వేదపారాయణ సంప్రదాయాలు కలగలిసిన ధర్మపురి క్షేత్రానికి గోదావరి పుష్కరాల చరిత్రలో ఒక ప్రత్యేకమైన, అద్వితీయమైన స్థానం ఉంది.**



ధర్మపురి పుష్కరాల ఆధునిక చరిత్రను పరిశీలిస్తే 2003 జూలై 30 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఉత్సవాలు ఒక మైలురాయిగా నిలిచాయి. ఆ సమయంలో ధర్మపురి శ్రీమఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణలో గోదావరి నదీ తీరాన అత్యంత వైభవంగా నిర్వహించిన 'శతచండీ సహిత ఋగ్వేద సంహితా యాగం' ఆధ్యాత్మిక లోకాన్ని ఎంతగానో ఆకర్షించింది. విశేషమేమిటంటే, అప్పట్లో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపిస్తున్న అప్పటి టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ యాగానికి రాజకీయాలకతీతంగా పూర్తి అండదండలు అందించారు. పార్టీ నిధుల నుండి లక్షలాది రూపాయల విరాళాన్ని సమకూర్చడమే కాకుండా, పుష్కరాల తొలి రోజే సతీసమేతంగా ధర్మపురి ఘాట్‌లో పవిత్ర స్నానమాచరించారు. ఆ సమయంలో ఆయన "ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలి" అని గోదావరి తల్లికి మొక్కుకోవడం, ఆ తర్వాతి కాలంలో అది సాకారం కావడం గమనార్హం.

కాలక్రమంలో ఉద్యమం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ తన పూర్వ సంకల్పాన్ని మరువలేదు. సరిగ్గా 12 ఏళ్లకు, అంటే 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగిన 'గోదావరి మహా పుష్కరాల' (ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే బృహత్తర సంప్రదాయం) సందర్భంగా ఆయన ధర్మపురి క్షేత్రాన్ని ఎంచుకుని ప్రారంభ స్నాన సంకల్పం చేయడం విశేషం. గోదావరి తల్లికి కృతజ్ఞతగా సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నాడు తాము మొక్కుకున్న మొక్కుబడి కింద ఒక అద్భుతమైన స్వర్ణకంకణాన్ని తయారు చేయించి తెచ్చారు. ఆ స్వర్ణకంకణాన్ని దేవస్థాన ఆస్థాన వేదపండితుని హస్తానికి స్వయంగా తొడిగి తన భక్తిని చాటుకున్నారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా ఉన్న కొప్పుల ఈశ్వర్ చొరవతో ధర్మపురి రూపురేఖలు మార్చడానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. స్నానఘట్టాల విస్తరణ, రహదారుల వెడల్పు, తాత్కాలిక వసతులు, పారిశుధ్య ఏర్పాట్లు ముమ్మరంగా సాగాయి. అయితే, భక్తుల సంఖ్య అంచనాలను మించిపోవడంతో 2015 మహా పుష్కరాలు పాలకులకు, అధికారులకు ఒక పెద్ద పరీక్షగా మారాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలోని వివిధ గోదావరి ఘాట్లకు దాదాపు ఐదు కోట్లకు పైగా భక్తులు తరలిరాగా, అందులో అత్యధిక శాతం మంది ధర్మపురి క్షేత్రానికే పోటెత్తారు. ఫలితంగా ధర్మపురి పరిసర ప్రాంతాలలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయింది. ఎంతలా అంటే, అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ వంటి ప్రముఖులే సాధారణ ప్రజలతో పాటు గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చింది. ఈ సంఘటనలు భవిష్యత్తులో రాబోయే పుష్కరాల కోసం తాత్కాలిక ఏర్పాట్లు సరిపోవని, శాశ్వత మౌలిక వసతుల కల్పన, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలు ఎంత అత్యవసరమో స్పష్టమైన పాఠాలను నేర్పాయి.

ఈ గత అనుభవాలు, సవాళ్ల నేపథ్యంలో

గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు అత్యంత వైభవంగా జరగబోయే రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభం కావడం శుభపరిణామం. ప్రస్తుత జగిత్యాల జిల్లా పరిధిలోని ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో ఎదురైన రద్దీ సమస్యలను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలతో ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి నివేదించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, అందులో మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను కీలక సభ్యునిగా నియమించింది. దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి, దేవాదాయ కమిషనర్, ఆలయ స్థపతి, ఆగమ సలహాదారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన అధికారుల బృందం ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, ఘాట్ల విస్తరణ, శాశ్వత పార్కింగ్ స్థలాల గుర్తింపు, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై నివేదికలను సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ధర్మపురినే కాకుండా, బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న యావత్ గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఒకే మాలగా అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక పర్యాటక కారిడార్‌గా మార్చాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బాసర జ్ఞానసరస్వతి ఆలయాన్ని, కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పనులను సమీక్షించారు. శనివారం ధర్మపురి సమీపంలోని గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం కూడా ఈ వ్యూహాత్మక అభివృద్ధిలో భాగమేనని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే, బాసర, కాళేశ్వరం, భద్రాచలం క్షేత్రాలకు అందుతున్న ప్రచారం, నిధుల ప్రకటనల జోరుతో పోలిస్తే, ధర్మపురి క్షేత్రానికి సంబంధించి ఇంకా నిర్దిష్టమైన మాస్టర్ ప్లాన్, కేటాయించే నిధుల అధికారిక వివరాలు పూర్తిస్థాయిలో బహిర్గతం కాకపోవడం స్థానిక భక్తులు, ఆలయాభిమానులలో కొంత ఆందోళనను, అసంతృప్తిని కలిగిస్తోంది. 'దక్షిణకాశి' అనే సముచిత గౌరవానికి తగ్గట్టుగా ధర్మపురిలో నదీ తీర రక్షణ గోడలు (రిటైనింగ్ వాల్స్), శాశ్వత భక్త నివాస సముదాయాలు, ఆధునిక శ్మశాన వాటికలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి పటిష్టమైన పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభం కావాలని క్షేత్రవాసులు కోరుతున్నారు.

నిజానికి, గోదావరి పుష్కరాలు అనేవి కేవలం పన్నెండు రోజుల పాటు జరిగే ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు. అవి ఆయా ప్రాంతాల సాంస్కృతిక వైభవాన్ని చాటడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, పర్యాటక రంగాన్ని విస్తరించడానికి మరియు వందలాది మందికి ఉపాధి కల్పించడానికి లభించే ఒక అద్భుతమైన సువర్ణావకాశం. గతకాలపు లోపాలను అధిగమిస్తూ, రాబోయే కాలపు భక్తుల రద్దీ అంచనాలకు తగినట్లుగా ముందస్తు వ్యూహాలతో అడుగులు వేయాల్సి ఉంది. ప్రభుత్వం, దేవాదాయ శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తజనం సమన్వయంతో కదిలి, ధర్మపురిని ఒక అంతర్జాతీయ స్థాయి యాత్రా కేంద్రంగా తీర్చిదిద్దగలిగితే, రాబోయే 2027 గోదావరి పుష్కరాలు తెలంగాణ నూతన చరిత్రలో పవిత్రమైన, శాశ్వతమైన విజయ అధ్యాయంగా నిలిచిపోవడం ఖాయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

### భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకొచ్చే యత్నం రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్



**చెన్నై, (సింగిడి):** తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీకి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ - సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు- కోడ లిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలకపాత్ర పోషిం చారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ - సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నట్లు చెన్నై వర్గాల సమాచారం.

## ఈషా సింగ్‌కు లైఫ్‌స్పాన్ ఘన సన్మానం

**హైదరాబాద్, బ్యూరో, సింగిడి :** జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్-2026లో మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి, ప్రపంచ రికార్డు నెలకొల్పిన షూటర్ ఈషా సింగ్‌ను హైదరాబాద్‌లో లైఫ్‌స్పాన్ సంస్థ ఘనంగా సన్మానించింది. లైఫ్‌స్పాన్ వ్యవస్థాపకుడు, సీఎండీ డాక్టర్ నరేంద్ర రామ్ నంబుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ వీసీ & ఎండీ సోని బాలా దేవి, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈషా సింగ్ మాట్లాడుతూ, తన విజయానికి పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణే బలమైన పునాదులని పేర్కొన్నారు. తన కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భారత షూటింగ్ దిగ్గజ కోచ్ జస్పాల్ రాణా సేవలను స్మరించుకుంటూ ఆయన మృతికి నివాళిగా ఒక నిమిషం మౌనం పాటించారు.

# పచ్చి కూరగాయల పప్పు..

## దీని ముందు చికెన్.. మటన్ కూడా పనికిరావు



**కావాల్సిన పదార్థాలు:**

ఒక కప్పు కంది పప్పు, నాలుగు టమాటాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు బీన్స్, నాలుగు బంగాళాదుంప, కొద్దిగా కాలీఫ్లవర్, రెండు ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్, కొద్దిగా తాలింపు గింజలు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ పసుపు, కొద్దిగా కారం, ఇంకా నూనెను తీసుకోవాలి.

**పప్పును బాగా ఉడికించుకోవాలి:**
ముందుగా ఒక కప్పు కంది పప్పును తీసుకుని కనీసం మూడు రెండు సార్లు కడిగి, కనాలుగు ప్పుల నీరు, ఇంకా దీనిలో ఒక టేబుల్ స్పూన్ పసుపు, అలాగే పప్పు ఉడకడానికి నూనెను వేసి ప్రెజర్ కుక్కర్‌లో వీటిని బాగా ఉడికించాలి. మీరు ఇంట్లో చేసేటప్పుడు కూడా ఇలాగే చేయండి.

**కూరగాయలను మెత్తగా ఉడికించుకోవాలి:**

పప్పు బాగా ఉడికిన తర్వాత మీరు కట్ చేసుకున్న కూరగాయలు వేసి, వాటిలో కొద్దిగా అంటే రుచికి సరిపడా ఉప్పు, మళ్ళీ టేస్టింగ్ సాల్ట్ వేసి కూరగాయలు మెత్తగా అయ్యే వరకు దీని మీద మూత పెట్టి ఈ పప్పును బాగా ఉడికించాలి. ఇలా ఉడికిస్తే పప్పు మరింత రుచిగా ఉంటుంది.

**టమోటాలను బాగా ఉడికించుకోవాలి :**
ఇక ఇప్పుడు దీనిలో కట్ చేసిన టమోటా ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ కారం వేసి స్టవ్ మీద ఉంచి మెత్తగా అయ్యే వరకు బాగా ఉడికించాలి. అలాగే, దీనిలో ఒక గ్లాస్ నీళ్లు పోసి, ఇంకా మంచి రుచి రావాలంటే ఈ పప్పును 10 నిమిషాల పాటు మీడియం మంట మీద గ్యాస్ మీదే ఉంచి ఉడికించాలి.

**పప్పును పోపు పెట్టుకోవాలి:**

ఇప్పుడు రెండో సారి మళ్ళీ స్టవ్ వెలిగించి చిన్న పాన్ పెట్టుకుని దానిలో 4 టేబుల్ నూనె చేసి పోపు గింజలు, నాలుగు ఎండుమిర్చి, కొద్దిగా జీలకర్ర, 5 కరివేపాకు ఆకులు కూడా దీనిని పోపు పెట్టుకోవాలి. ఆ తర్వాత కట్ చేసిన ఉల్లిపాయ, నాలుగు పచ్చిమిర్చి ముక్కలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ కలపాలి. అంతే, పచ్చి కూరగాయల పప్పు రెడీ.





వేసవి కాలం రాగానే దాహం, అలసట సహజం. ఈ సమస్యలను అధిగమించడానికి మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, మన స్థానిక బెర్రీలే ఉత్తమం. మన ఆహార సంప్రదాయాల్లో భాగమైన జామూన్, ఫల్సా వంటి పండ్లు రోగనిరోధక శక్తిని పెంచి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అద్భుతమైన రుచి, పోషకాలను అందించే ఆ దేశీ బెర్రీల గురించి తెలుసుకుందాం!

# సమ్మర్‌లో ఈ ఫ్రూట్స్ తినకపోతే చాలా మిస్ అయినట్టే..?

**వేసవిలో లభించే అద్భుతాలు**

వేసవి ఎండల నుంచి రక్షణ పొందడానికి మరియు శరీరానికి కావాల్సిన పోషకాలను అందించడానికి మనకు దొరికే స్థానిక పండ్లు ఎంతో సహాయపడతాయి. విదేశీ బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీల కోసం వెతకాల్సిన అవసరం లేదు, మన భారతదేశంలోనే ఎంతో కాలంగా వాడుకలో ఉన్న అద్భుతమైన బెర్రీలు ఎన్నో ఉన్నాయి.



**జామూన్ (నేరేడు):**
వేసవిలో అందరూ ఎదురుచూసే పండు ఇది. దీని ముదురు ఊదా రంగు, తీపి మరియు పులుపు కలిసిన రుచి ఎంతో బాగుంటుంది.

**ఫల్సా:**
చిన్నపాటి ఊదా రంగు పండు ఇది. దీన్ని ఎక్కువగా చల్లని పానీయాలు చేయడానికి ఉపయోగిస్తారు, ఇది శరీరానికి తక్షణ ఉల్లాసాన్ని ఇస్తుంది.



**కరోందా:**
వీటిని ఎక్కువగా పచ్చళ్లు, చట్నీలు చేయడానికి ఉపయోగిస్తారు. వీటి పుల్లని రుచి వంటకాలకు ప్రత్యేకతను తెస్తుంది.

**మల్బరీ:**
దేశవ్యాప్తంగా లభించే ఈ పండ్లు చాలా రసభరితంగా, తియ్యగా ఉంటాయి.

**రస్‌భరీ, మహువా:**
ఇవి కొన్ని ప్రాంతాలకే పరిమితమైనా, స్థానికులు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. ఇవి సంప్రదాయ ఆహారంలో భాగం.

**ఆరోగ్యంపై ప్రభావం**

ఈ పండ్లు కేవలం రుచికరమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. విటమిన్-సి అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పీచు పదార్థం (ఫైబర్) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు వేసవిలో మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది.

సీజనల్ పండ్లను తినడం వల్ల తాజాగా పండించిన పంటను మనం ఆస్వాదించవచ్చు. ఇవి ఎక్కువ దూరం ప్రయాణించి రావు కాబట్టి, వాటి పోషకాలు అలాగే ఉంటాయి. వీటిని నేరుగా తినవచ్చు లేదా జ్యూస్‌లు, డెజర్ట్‌లలో వాడుకోవచ్చు. మీరు తదుపరిసారి మార్కెట్‌కు వెళ్ళినప్పుడు, ఈ దేశీ బెర్రీలను ఎంచుకోండి. వేసవిని సహజమైన రుచులతో, ఆరోగ్యంతో ఆస్వాదించండి. మన దేశీయ పండ్ల వైభవాన్ని గుర్తించి, వాటిని మన దైనందిన ఆహారంలో భాగంగా మార్చుకుందాం. ఇవి మనల్ని ఆరో గ్యంగా ఉంచడమే కాకుండా, మన సంప్రదాయాలను కూడా గౌరవించినట్లు అవుతుంది.



# రోటి పచ్చడి..

## తింటే భోజనం ప్లేట్ ఖాళీ కావడం ఖాయం!



బెండకాయ రోటి పచ్చడికి కావాల్సిన పదార్థాలు: పావుకిలో బెండకాయలు, ఒక ఉల్లిపాయ, 10 పచ్చిమిర్చి, 6 వెల్లుల్లి రెబ్బలు, చిన్న నిమ్మకాయంత చింతపండు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర , ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, రుచికి సరిపడా ఉప్పు, రెండు టేబుల్ స్పూన్స్ నూనె, అలాగే తాలింపు కోసం అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ మినప్పప్పు, రెండు ఎండు మిర్చి, నాలుగు కరివేపాకులు తీసుకోవాలి.

బెండకాయ రోటి పచ్చడి తయారీ విధానం: ముందుగా బెండకాయలను తీసుకుని బాగా కడిగి వాటిని బాగా ఆరనివ్వాలి. ఇంకా వీటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ పెట్టుకోవాలి. పాన్‌లో ఒక స్పూన్ ఆయిల్ వేసి అర టేబుల్ స్పూన్ జీలకర్ర, అర టేబుల్ స్పూన్ ధనియాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు వెల్లుల్లి కూడా వేయించి పక్కన పెట్టుకోవాలి.

అదే పాన్‌లో ఇంకో స్పూన్ ఆయిల్ వేసి నాలుగు బెండకాయ ముక్కలను వేసి బాగా వేయించాలి. ఇంకా ఈ బెండకాయలో జిగురు పూర్తిగా పోయి వాటిని గోల్డ్ కలర్లోకి వచ్చే వరకు వీటిని బాగా వేయించాలి. ఇప్పుడు కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి రెండు నిమిషాల వేయించాలి. ఇంకా వీటితో పాటు చింతపండును కూడా కొద్దీ పాటు నానబెట్టి రెడీ చేసుకోవాలి.

ఇప్పుడు మిక్సీలో వీటిని బాగా వేయించి ఇంకా వీటితో పాటు కొద్దిగా జీలకర్ర, ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, నాలుగు పచ్చిమిర్చి, నాలుగు వెల్లుల్లి, కొద్దిగా చింతపండు, వీటిలో ఉప్పు వేసి మెత్తగా పట్టుకోవాలి. ఆ తరవాత వేయించిన బెండకాయకాను వేసి రోటిలో దంచుకోవడమే. మిక్సీ పట్టుకున్న పచ్చడిని దీనిలో కొద్దిగా దంచుకోవాలి. చివర్లో ఈ తాలింపు వేసి మంచిగా కలిపితే టేస్టీ టేస్టీ బెండకాయ రోటి పచ్చడి రెడీ.

రాగి సంకటి, జొన్న రొట్టెలోకి సూపర్ : మిక్సీలో వీటిని మెత్తగా చేయకుండా కచ్చా పచ్చాగా దంచితే మంచి రుచి వస్తుంది. ఇంకా ఈ బెండకాయ రోటి పచ్చడిని వేడి వేడి అన్నంలో కలిపి తింటే డబుల్ రుచితో మంచిగా ఉంటుంది. అంతే కాదు, వీటిని రాగి సంకటి, జొన్న రొట్టెలు, చపాతీలతో తింటే వదలకుండా తింటారు.







మార్కెట్లపై ఐటీ దెబ్బ..

# నష్టాలతో ముగిసిన సూచీలు

దేశీయ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. గత ఐదు సెషన్లలో లాభాలను ఆర్జించిన సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. టెక్ దిగ్గజం యాక్సెంచర్ ఆందోళనలు దేశీయ ఐటీ షేర్లను కుదిపేశాయి. దీంతో మార్కెట్లు పతనమయ్యాయి. చివర్లో కాస్త కొనుగోళ్లు జరిగినా.. సూచీల కు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 600 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కష్టంగా నిలబెట్టుకుంది.

ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆరంభం నుంచే సూచీలు ఢీలా పడ్డాయి. 76,852.86 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఒక దశలో ఏకంగా 940 పాయింట్లు దిగజారి 76,649 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. సెషన్ చివర్లో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టం కొంత తగ్గింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 607.08 పాయింట్లు పతనమై




76,802.90 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ ) కూడా 26,373.20 - 24,047.20 మధ్య కదలాడింది. చివరకు 154.90 పాయింట్లు తగ్గి 24,013.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది.

అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాక్సెంచర్ తన ఆదాయ వృద్ధి అంచనాలను తగ్గించడంతో పాటు భవిష్యత్తులో డిమాండ్ బలహీనంగా ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈ రంగంపై ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల షేర్లు భారీగా కుదేలయ్యాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 6.75శాతం, టీసీఎస్ 3.55శాతం, టెక్ మహీంద్రా 2.63శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.59శాతం మేర కుంగాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, నెస్లే షేర్లు రాణించాయి. అమెరికా మార్కెట్లలో యాక్సెంచర్ షేర్లు గురువారం ఏకంగా 17శాతం మేర కుంగడం గమనార్హం.


స్టార్‌లింక్‌కు పోటీగా

# శాట్‌కామ్ రంగంలోకి జియో

## ఆకాశ్ అంబానీ

**దిల్లీ:** టెలికాం సేవల విభాగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న జియో... ఇప్పుడు స్వదేశీ కమ్యూనికేషన్ ఉపగ్రహాల ద్వారా అంతరిక్షం నుంచి కనెక్టివిటీని అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు శాట్‌కామ్ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కంపెనీ చూస్తోందని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. ప్రస్తుతం శాటిలైట్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, ఫ్రాన్స్‌కు చెందిన యుటెల్‌శాట్ వంటి విదేశీ కంపెనీల హవా నడుస్తోంది. ఈ విభాగంలో జియో కూడా అడుగుపెట్టబోతోంది.

"జియో భారతదేశాన్ని భూమిపై అనుసంధానించింది. ఇప్పుడు అంతరిక్షం నుంచి అనుసంధానించాలి. జియో నెట్‌వర్క్ చేరుకోలేని మారుమూల గ్రామాలు, ద్వీపాలు, సరిహద్దు ప్రాంతాలు ఇంకా ఉన్నాయి. వాటిని అనుసంధానం చేయడానికి శాటిలైట్ కనెక్టివిటీ ఉపయోగపడుతుంది. ఇందుకోసం సొంతంగా లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ వ్యవస్థను అభివృద్ధి చేయడాన్ని జియో పరిశీలిస్తోంది" అని రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశంలో




ఆకాశ్ అంబానీ వెల్లడించారు.

దీర్ఘకాలంలో సొంతంగా శాటిలైట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటూనే.. మరోవైపు సేవల లభ్యతను వేగవంతం చేయడానికి తాము అంతర్జాతీయ సంస్థలతో శాటిలైట్ సామర్థ్యాన్ని లీజుకు తీసుకుంటామని ఆకాశ్ అంబానీ తెలిపారు. దీనివల్ల మన కనెక్టివిటీ అవసరాలను జియో వేగంగా తీర్చడంతో పాటు ప్రపంచ స్థాయి భారతీయ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాట్‌ఫారమ్‌కు పునాది వేస్తుందని వివరించారు. అలాగే, జియో తన సొంత గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తోందని చెప్పారు. అంతరిక్ష రంగంలో జియో ఆత్మనిర్భరత వైపు అడుగులు వేస్తోందన్నారు.


రిలయన్స్ జియో ఐపీఓ..

# సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు

మదుపరులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'జియో ఐపీఓ'కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. అంతకుముందు జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు డీహెచ్‌ఆర్‌పీకి ఆమోదం తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ఐపీఓ పత్రాలను నేడే సమర్పించనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడించిన కాసేపటికే సెబీకి ఈ పత్రాలు చేరాయి.

"ఇది నాతో పాటు రిలయన్స్ కుటుంబానికి, కోట్లాది మంది వాటాదారులకు భావోద్వేగభరిత క్షణం. జియో ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను బోర్డు ఆమోదించింది. ఈ రోజే సెబీకి సమర్పిస్తాం. ఈ ఏడాది రిలయన్స్‌కు జియో ఐపీఓ అత్యంత ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇది మా వాటాదారులకు గణనీయమైన విలువను అందించడంతో పాటు కొత్త పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తుందని విశ్వసిస్తున్నా. ప్రపంచ స్థాయి సామర్థ్యం కలిగిన సాంకేతిక సంస్థలను భారత్ నిర్మించగలదని జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుంది" అని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

**27 కోట్ల షేర్లు**
ఈ ఐపీఓ ద్వారా సుమారు 4





బిలియన్ డాలర్ల (సుమారు రూ.37,700 కోట్లు) నిధులు సేకరించాలని భావిస్తున్నారు. ఈ పబ్లిక్ ఇష్యూలో 27 కోట్ల కొత్త షేర్లను ఇన్వెస్టర్లకు జారీ చేయనున్నారు. ఐపీఓ ద్వారా వచ్చే మొత్తాన్ని కంపెనీ తీసుకున్న అప్పులను తీర్చడానికి ఉపయోగించనున్నారు. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగిస్తారు. డ్రాఫ్ట్ పేపర్లు దాఖలు చేసే నాటికి.. ప్రమోటర్ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు జియో ప్లాట్‌ఫార్మ్‌లో 66.43 శాతం వాటా ఉంది.

గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని అప్పట్లో తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడం వంటి పరిణామాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది.

తగ్గిన బంగారం.. వెండి ధరలు..

# రూ.1.50లక్షల దిగువకు పసిడి



అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం.



# నీట్ (యూజీ) పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

## అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 19 (సింగిడి):** జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



**అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి..**
ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో, పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్.

**పాటించాల్సిన సూచనలు..**
-అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
-ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి. -పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి.

**నిషేధిత వస్తువులు..**
-స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు, ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు. పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ)--2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

## ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం వేడుక



**అల్వాల్, జూన్ 19 (సింగిడి):** ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా ఓల్డ్వా ఆల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అల్వాల్ లో నిర్వహించుకున్నారు. సికిల్ సెల్ వ్యాధి అంటే ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారి రక్తప్రసరణకు ఆటంకంగా మారి ఇబ్బందులు కలిగిస్తాయి. ఈ వ్యాధి వలన రక్తహీనత తీవ్రమైన నొప్పి శరీర అవయాలు పనితీరుపై ప్రభావం పిల్లల్లో ఎదుగుదల ఉండదని అవగాహన డాక్టర్లు కల్పించారు. క్రమము తప్పకుండా చికిత్స మాత్రలను వాడాలని అన్నారు. డిఎంహెచ్వో డాక్టర్ లావణ్య ఆదేశానుసారం మేరకు ఈనెల జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉదయం ఏడు గంటలకు జరుపుట కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ, డాక్టర్ అనగ్, వైద్య సిబ్బంది, మెడిసిటీ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యపై అధికారులతో సమీక్ష



**కుత్బుల్లాపూర్, జూన్ 19 (సింగిడి): :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ ప్రగతి నగర్ డివిజన్ (276) లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హెచ్ ఎం డబ్ల్యు ఎస్, ఎస్ బి, సి ఎం సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, జనరల్ మేనేజర్ నాగ పరిమళ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించి, ప్రగతి నగర్ ప్రాంతంలో నెలకొన్న మంచినీటి కొరత సమస్యపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను అత్యవసరంగా చేపట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం మోర్ సూపర్ మార్కెట్ వెనుక ఉన్న నిల్వ ట్యాంకుల వద్దకు వెళ్తున్న వాటర్ ట్యాంకర్లను సూరవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని స్టోరేజ్ ట్యాంక్ వద్దకు మళ్లించే అవకాశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిల్వ ట్యాంకర్లు చేరుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడం సమస్యగా గుర్తించి, ఈ అంశాన్ని సంబంధిత మంత్రి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా గుర్తించి, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఫ్రైడే.. డ్రైడే

**దుబ్బాక, జూన్ 19 (సింగిడి)::** తిమ్మాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో "ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పరిశుభ్రత, పచ్చదనం, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రంజిత్ కుమార్, ఉప సర్పంచ్ వి. విజయకుమార్, అంగన్వాడీ టీచర్లు పి. మంజుల కేతార్, ఆశా వర్కర్లు అనిత ఐ. విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ అంతయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని సంకల్పించారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం





## ఎమ్మెల్యే వివేకానంద

## ఎమ్మెల్యేను కలిసిన విష్పర్ వ్యాలీ కాలనీ నూతన కమిటీ సభ్యులు

**కుత్బుల్లాపూర్, జూన్ 19 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి 274వ వార్డు, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న విస్పర్ వ్యాలీ కాలనీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కె.పి. వివేకానంద్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించి, కాలనీ అభివృద్ధి కోసం తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల కొరత తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, ఆయా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చరవాణి ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, 20వ వార్డు బి.ఆర్.ఎస్. పార్టీ మహిళా అధ్యక్షురాలు సంధ్యా రాణి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి నాగమణి, సోషల్ మీడియా అధ్యక్షుడు విద్యాసాగర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి లీలావతి, సంయుక్త కార్యదర్శి పృథ్వీ కుమార్, కోశాధికారి రామకృష్ణ బండి, సత్యం వ్యాలీ వాసులు చిట్టిబాబు, ప్రసాద్, రామ్ ప్రసాద్, అశోక్, రదీప్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరం: కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 19 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సాయిబాబా నగర్, బాచుపల్లి ప్రాంతాలకు చెందిన అంబుగోల ప్రసాద్, మేకల రుద్రమదేవి లు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయమును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా తమకు ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. వెంటనే స్పందించిన హనుమంత రెడ్డి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బాధితులకు వైద్య చికిత్స, శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి పతకములో కావాల్సిన ఆర్థిక సహాయం పొందుటకు 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శుక్రవారం బాధితుల కోసం మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి పత్రాలను బాధితులకు కొలను హనుమంత రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరంలాంటిదని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో వెలుగును నింపుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**నాచారం, జూన్ 19 (సింగిడి) :** నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి లేబర్ సెల్ ఉపాధ్యక్షులు వి.ఎస్. ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, సుధాకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, నరసింగ్ రావు, షరీపుద్దీన్, అజీమ్, నరేష్, యూసుఫ్, కృపాకర్, ఫిరోజ్, రేవంత్, సాయిబాబా,



మహిళా నాయకులు ఉమా, సునీత, మమత, యాస్మీన్, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు 30 వరకు ఈకేవైసీ చేసుకోండి

### ఇండియన్ గ్యాస్ ప్రొప్రైటర్ మొయిజొద్దీన్

**రేగోడు, జూన్ 19(సింగిడి):** గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు మా ఆఫీస్ కు వచ్చి ఈనెల 30 తేదీ వరకు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని ఇండియన్ గ్యాస్ ప్రొప్రైటర్ మొయిజొద్దీన్ రేగోడు ఇండియన్ గ్యాస్ ఆఫీస్ లో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతాల్లో ఉండేవారు ఇండియన్ ఆయిల్ వన్ అప్లికేషన్ ఇన్స్టాల్ చేసుకోని ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేసుకోక పోతే గ్యాస్ బుకింగ్ బ్లాక్ అవుతుందని, అక్రమ గ్యాస్ కనెక్షన్స్ కు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చే రాయితీ దుర్వినియోగం కాకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొప్రైటర్ తెలిపారు.

# మరోసారి ఉదారతను చాటిన నీలం మధు





## రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా పుట్టిన పిల్లలకు 20వేల రూపాయల ఫిక్స్ డిపాజిట్ జిహెచ్ఎంసీ సిబ్బందికి నిత్యావసరాలు పంపిణీ

**పటాన్చెరు, జూన్ 19 (సింగిడి):** బుధవారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ముత్తంగి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా, సేవా కార్యక్రమాలతో మిన్నంటాయి. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. కేవలం కేక్ కటింగ్స్, హంగామా వంటి ఆడంబరాలకు పోకుండా, సమాజంలోని అట్టడుగు వర్గాలకు, నిరుపేదలకు అండగా నిలిచేలా పలు వినూత్న సేవా కార్యక్రమాలను చేపట్టడం ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని నీలం మధు ముదిరాజ్ తన అపారమైన ఉదారతను చాటుకుంటూ పసికందుల భవిష్యత్తుకు భరోసా కల్పించారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ రోజు జన్మించిన పసికందులకు వారి భవిష్యత్తు భద్రత కొరకు ప్రతి సంవత్సరం లాగే ఈ సారికూడా తలా 20 వేల రూపాయల చొప్పున ఫిక్స్ డిపాజిట్ చెక్కు లను అందజేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ప్రసవాలు చేసుకునే నిరుపేద కుటుంబాలకు ఈ సాయం కొండంత అండగా నిలిచింది. అదేవిధంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ అహర్నిశలు శ్రమిస్తున్న జీహెచ్‌ఎంసీ సఫాయి కార్మికులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం వారి కుటుంబాలకు అవసరమైన నిత్యవసర వస్తువుల కిట్లను నీలం మధు ముదిరాజ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమాజ సేవలో భాగస్వాములవుతున్న కార్మికులను గౌరవించుకోవడం మన అందరి బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశంలో ద్వేషాన్ని తొలగించి, ప్రేమాభిమానాలను నింపడమే లక్ష్యంగా రాహుల్ గాంధీ గారు 'భారత్ జోడో యాత్ర' చేపట్టారని, ఆయన ఆశయాలు, త్యాగాలు దేశ యువతకు ఎంతో ఆదర్శమని కొనియాడారు. దేశ రక్షణే ధ్యేయంగా, పేదల గొంతుకగా ఆయన నిరంతరం పోరాడుతున్నారని భావోద్వేగంగా మాట్లాడారు. రాహుల్ గాంధీ పుట్టినరోజున పేద ప్రజలకు, కార్మికులకు సేవ చేయడం ద్వారా ఆయనకు నిజమైన జన్మదిన కానుక ఇస్తున్నామని, పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన పసికందుల భవిష్యత్తుకు చిన్న సాయం అందించడం, అలాగే ఎండనక వాననక కష్టపడే మన జీహెచ్‌ఎంసీ కార్మికులను ఆదుకోవడం తమకు దక్కిన అద్భుతమైన అవకాశంగా భావిస్తున్నానని చెప్పారు. రాబోయే రోజుల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాహుల్ గాంధీ గారి నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రజల పక్షాన నిలబడి మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నీలం మధు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, నరసింహ రెడ్డి, వెంకటేష్ నాయక్, రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్ రెడ్డి, మణికంత, సందీప్ గౌడ్, జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కోల్కూరి నరసింహారెడ్డి, అశోక్ ముదిరాజ్, మధు పంతులు, గడ్డ యాదయ్య, గుండ్ల మహేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి,గోపాలకృష్ణ, సందీప్ యాదవ్, దశరథ్,ప్రవీణ్, విఠల్, రంజిత్ తదితరులు పాల్గొనారు.

## ఘట్‌కేసర్‌లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

**కీసర, జూన్ 19 (నినాదం) :** ఘట్‌కేసర్ సర్కిల్, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ మామిడ్ల ముత్యాలు యాదవ్, మాజీ చైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్, గడ్డన్నారం ఫ్రూట్స్ మార్కెట్ డైరెక్టర్ మచందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు






## 350 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 19 (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఏపీలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి 200 కేజీల భారీ కేకును చిన్నారులతో కట్ చేయించి, 350 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేశారు. భారీగా కార్యకర్తలతో రాహుల్‌గాంధీ జన్మదినం వేడుకలను నిర్వహించి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బీహెచ్ఈఎల్, బిడిఎల్, ఓడిఎఫ్, ఇక్రిశాట్ ఐఐటి హైదరాబాద్ లాంటి కేంద్ర సంస్థలు సంగారెడ్డి జిల్లాకి కాంగ్రెస్ పార్టీ జిల్లాకు తెచ్చిందని ఇచ్చిందని అన్నారు. కానీ ఇప్పటి బీజేపీ మాత్రం ఉన్న కేంద్ర రంగ సంస్థలని ప్రయివేటీకరణ చేస్తుందని విమర్శించారు. బీజేపీ నేతలు నెహ్రూ పాలనని బ్రేక్ చేశామని సంబరాలు చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం ఆస్తులను దానం చేయడమే కాకుండా దేశ ప్రగతి కోసం పాటుపడినరన్నారు. మరి 12 ఏళ్ల ప్రధాని మోడీ పాలనలో ఏం చేశారో సమాధానం చెబుతారా అని ఆయన బిజెపి నేతలపై సవాల్ విసిరారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల పేరుతో ప్రధాని మోడీ యువతకి 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారన్నారు. బిజేపీ నేతలు దేవుళ్లపైనే కుట్రలు చేస్తున్నారన్నారని, ఇతర పార్టీలకు దేవుళ్ళతో సంబంధాన్ని వీడదీశారని విమర్శించారు. రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్ర ప్రజలతో పాటు, దేశ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని జగ్గారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి తో పాటు నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



**అల్వాల్, జూన్ 19 (సింగిడి):** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అల్వాల్ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. అల్వాల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు కేబుల్ శేఖర్ ఆధ్వర్యంలో అల్వాల్ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఇచ్చిన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, సి ఎల్ యాదగిరి, శ్రీశైలం యాదవ్, శివకుమార్, వెంకటేష్ గౌడ్, నాగేశ్వరరావు, దిడ్ల స్వామి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్, సంపత్ యాదవ్, వీనస్ మేరీ, బబిత, ముదిరాజ్, లావణ్య కృష్ణ ముదిరాజ్, పద్మ, నిర్మల, లక్ష్మి, శారద, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాదులు

**ఆమనగల్లు, జూన్ 19(సింగిడి):** అమనగల్లు మున్సిపాలిటీ కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి,సీడీపీవో శాంతిరేఖ తో కలిసి సందర్శించారు. అమ్మా మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, కమిషనర్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలే పిల్లలకు అక్షరాలు నేర్పే తొలి బడి అని, ఇక్కడే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని అన్నారు. ప్రభుత్వం అందించే బలవర్ధకమైన ఆహారం పిల్లల శారీరక ఎదుగుదలకు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరు అంగన్వాడీ స్కూలుకి 3నుండి 6సంవత్సరాలపిల్లలందరిని తప్పనిసరి గా పంపించాలని, ప్రభుత్వము అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎకరూప దుస్తులను పంపిణి చేసి,అంగన్వాడీ బడి బాట ర్యాలీ చేపట్టారు.. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అంగన్వాడీ సూపర్వైజర్ అనిత,అంగన్వాడీ టీచర్స్ సంధ్య, సునీత, రజిత, రాజ్యలక్ష్మి,నాజిమా, విమల పాల్గొన్నారు.



# మున్సిపల్ నక్ష 50 శాతం, డేటా ఎంట్రీ 10 శాతం పూర్తి

## కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 19 (సింగిడి):** నల్గొండ జిల్లాలో పైలెట్ పద్ధతిన చేపట్టిన మిర్యాలగూడ మున్సిపల్ నక్ష సర్వే 50 శాతం పూర్తి అయిందని, డేటా ఎంట్రీ 10% పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్ర సీసీఎల్‌ఏ లోకేష్ కుమార్ కు తెలిపారు. 32 వార్డులో 1552 ప్రాపర్టీస్ వివరాలు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. శుక్రవారం రాష్ట్ర సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేష్ కుమార్ హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లతో నక్ష సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాప్ లో సాంకేతిక సమస్యలు తలెత్తినందున సర్వే ఆలస్యం అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లు సర్వేకు సంబంధించి సమ్మతి ఇచ్చినందున ఈనెల 20 లోగా వారినుండి సమ్మతి తీసుకొని గజిట్ నోటిఫికేషన్ ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తొలుత సీసీఎల్‌ఏ లోకేష్ కుమార్ మాట్లాడుతూ నక్ష సర్వే కి సంబంధించి సర్వే వేగవంతం చేయాలని, సర్వే కు సంబంధించిన సామాగ్రినంతటిని సి ఎస్ ఆర్ కింద సమకూర్చుకోవాలి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి దేవరాజ్, తదితరులు ఉన్నారు.

## కన్నీటి వేళ చేయూతనందించిన దాతలు..



**కోదాడ, జూన్ 19(సింగిడి):** అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన పస్తం రాము ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న 10వ వార్డు సభ్యురాలు పర్వతం కవిత శ్రీను, మిత్రుల సహకారంతో రూ.10 వేల నగదు సాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లికొండ జయరాజు, కార్యదర్శి నాగలక్ష్మి, రేవెల్ల కృష్ణ, పల్ల బాలు తదితరులు పాల్గొని తమ వంతు సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యులు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడుల బలోపేతం

### విద్యార్థులకు పోషకవిలువల ఆహారం అందిస్తున్నాం

### జిల్లా విద్యాధికారి రాజేందర్



**మహాముత్తారం, జూన్ 19(సింగిడి):** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ అన్ని వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చేరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ వారానికి మూడు రోజులు రాగి జావా, మూడు రోజులు కోడిగుడ్లు, విద్యార్థు లకు త్వరలో మిల్లెట్స్ పూరి, ఇడ్లీ రోజుకొక వేరేటి కూడా ప్రభుత్వం పిల్లలకు అందుబాటులో తీసుకురావడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఒక ఎనిమిది జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు కింద సెలెక్ట్ చేసి అమలు చేయడం జరుగుతుందని, మన ప్రభుత్వ పాఠ శాలలో కూడా ఇలాంటి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మహాముత్తారం గ్రామంలో ఉన్న బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారికి మంచి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ పాఠశాలలను మించిన పాఠశాల లేదన్నారు. డిజిటల్ క్లాసులు, అక్షరాభ్యాసం వన మహోత్స వం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిని చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ కొండ గొర్ల బాబు మండల విద్యాధికారి కే సాంబశివరావు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత తిరుపతి, ఉపాధ్యాయులు కవిత, అపర్ణ, అనిల్, శారద, రఘుపతి మంజుల, అంగన్వాడీ సూపర్వైజర్ జ్యోతి, రోజా, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## నానో యూరియాపై రైతులకు అవగాహన



**అమరచింత, జూన్ 19 (సింగిడి):** ఆత్మకూరు మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్ద శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రమేష్ రైతులకు నానో యూరియా పై అవగాహన కల్పించారు. నానో యూరియా తప్పనిసరిగా కొనాలని నిబంధన ఏమీ లేదని రైతులకు గుర్తుంచుకోవాలన్నారు. రైతులకు, ఎరువుల నానో యూరియా తప్పనిసరిగా కొనాలని రైతులని ఇబ్బందికి గురి చేయరాదని డీలర్ బషీర్ ను ఆదేశించారు. ఫర్టిలైజర్ యజమానులు ఎవరైనా అన్ని బంధనాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని మహేశ్వరి, ఆగ్రో సేవా కేంద్రం, బషీర్ ఏజెన్సీలను ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# డెంగ్యూ మలేరియా నివారణకు కృషి చేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్



**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 19(సింగిడి):** డెంగ్యూ, మలేరియా లాంటి వాటిని నియంత్రించే వరకు సమిష్టిగా అధికారులు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ కలెక్టరేట్ ఐడిఓసి కార్యాలయంలోని మీటింగ్ హాల్లో వైద్యాధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో డెంగ్యూ మలేరియా ఫైలేరియా వ్యాధులను నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మునిసిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకొని పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటి తొలగింపు ,యాంటీ లార్వా చర్యలు, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ ను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రతి ఇంటికి ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 28 ,29 ,30 తేదీలలో నిర్వహించుచున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమానికి సంబంధించి పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలలో సమన్వయం చేసుకొని అర్హులైన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మాత శిశు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గర్భిణీల ఎర్లీ రిజిస్ట్రేషన్, కనీసం నాలుగు చీజ చెకప్స్ హైరిస్ ప్రెగ్నెన్సీ లను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాణి, మెడికల్ ఆఫీసర్లు , ఎంఎల్ హెచ్పి డాక్టర్స్, సూపర్వైజర్లు, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఎంఈఓకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



**అమరచింత, జూన్ 19, (సింగిడి):** నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే రాఘవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కే. రాఘవ మాట్లాడుతూ ఆత్మకూరు మండల లో ప్రవేట్ పాఠశాల అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అదేవిధంగా నోట్ బుక్స్ టై బెల్ట్ యూనిఫామ్ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు కొన్ని ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి ఇతర ఫౌండేషన్ కోర్సులతో పాఠశాల యజమానులు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు ప్రవేట్ పాఠశాల విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్నారని కొన్ని ప్రైవేట్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ని అనుమతి లేకుండా నడుపుతున్నారని ప్రవేట్ పాఠశాల ఎక్కువమంది విద్యార్థులు ఉండగా తక్కువ మూత్ర శాలలు ఉన్నాయి. పట్టణంలోని మూడు ప్రైవేటు ప్రైవేటు పాఠశాలలకు ప్రీ ప్రైమరీ అనుమతి లేకుండా ఉన్నట్లు పాఠశాలలు నడుపుతున్నారని విచారణ జరిపి చర్య తీసుకోవాలని అదేవిధంగా కొన్ని పాఠశాలలైతే కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా లేదు. కొన్ని ప్రవేట్ పాఠశాల బస్సులు అయితే ఒక బస్సులో 100 లేదా 120 మంది విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు అంతమంది ప్రయాణం చేస్తే విద్యార్థులకు ప్రమాదము జరిగే అవకాశం ఉందని తక్షణమే ఎంఈఓ స్పందించి పై సమస్యలు పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమేష్ మండల నాయకులు సంజయ్ రాజేష్ సాయి కృష్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



**కమలాపూర్, జూన్ 19 (సింగిడి):** కాంగ్రెస్ నాయకులు ఎంపీ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు గాలిబు నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్య దర్శి మాట్ల రమేష్, నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి, పోడేటి బిక్షపతి, తడక శ్రీకాంత్, పుల్ల శోభన్ , పల్లె సమ్మిరెడ్డి, పెరుమాండ్ల పరశు రాములు, ధర్ముల శ్రీకాంత్, సముద్రాల కృష్ణ, జరగాని శివకృష్ణ ఆకినపెల్లి బిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి ,మిల్కురి శ్రీనివాస్, జన్ను బిక్షపతి పుల్ల ఐలయ్య భాష బోయిన రమేష్ శనిగరపు రమేష్, వంటకాల రాజిరెడ్డి, మాట్ల కళ్యాణ్, చందబోయిన సాయి రామకృష్ణ గుంపుల అశోక్, తాటిపాముల రాములు, కొమురెల్లి, చిలువేరు రవి పాల్గొన్నారు.

## ఎంజియూ డిగ్రీ ఫలితాలు విడుదల

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 19(సింగిడి):** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ డిగ్రీ ఫలితాలను ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ లో 24.96%, రెండవ సెమిస్టర్ లో 32.49% , మూడవ సెమిస్టర్‌లో 32.66%, నాల్గవ సెమిస్టర్ లో 43.26 % , ఐదవ సెమిస్టర్ లో 47.28% , ఆరవ సెమిస్టర్ లో 53.48% ఉత్తీర్ణత సాధించినట్లు సిఓఈ ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, అసిస్టెంట్ కంట్రోలర్లు డా లక్ష్మీప్రభ, డా ప్రవళిక డా సంధ్యారాణి, డా కళ్యాణి, డా భిక్షమయ్య పాల్గొన్నారు.

## సర్కారు బడికి సర్పంచ్ కుమారుడు..

### ఆదర్శంగా నిలిచిన స్థంభంపల్లి పీపీ సర్పంచ్ కీర్తన శ్రీనివాస్



**మహాముత్తారం, జూన్ 19(సింగిడి):** : ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలంటే నామోషీగా బావించే ఈ రోజుల్లో తన కుమారుడిని సర్కారు బడిలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు మహాముత్తారం మండలం స్థంభంపల్లి( పీపీ) గ్రామ సర్పంచ్ జంగిడి కీర్తన శ్రీనివాస్... ప్రభుత్వ పాఠశాలలు పునప్రారంభం అయిన నేపథ్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు వారు పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తమ కుమారుడిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1 వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు అందరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో పాటు విలువలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఐసిడిసిస్ సూపర్ వైజర్ నాగమణి, ప్రధానోపాధ్యాయులు రవినాయక్ ఉపాధ్యాయులు పద్మ, మానస అంగన్వాడీ టీచర్ స్వరూప విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మేఘనకు ఎంబిబిఎస్ పట్టా..




**కమలాపూర్, జూన్ 19 (సింగిడి):** : మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన పోడేటి రేణుక మొగిలి దంపతుల కూతురు పోడేటి మేఘన, టిఆర్ ఆర్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో తన ఐదు సంవత్సరాల ఎంబి బిఎస్ కోర్స్ పూర్తి చేసుకొన్నారు. శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రామ్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ పట్టా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మేఘనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, అభినందించారు.

# దళితుల పొలంలో వేసిన పైపులైను తొలగించాలి

### జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాదారి భోజరాజు



**అమరచింత, జూన్ 19, (సింగిడి):** దళితుల భూములలో దళితులకు ఎలాంటి సమాచారం లేకుండా వారి పొలంలో దౌర్జన్యంగా పైప్ లైన్ వేసిన సంఘటనకు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాదారి భోజరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా వనపర్తి మున్సిపాలిటీ కి చెందిన 12వ వార్డు రాజనగరం లో దళితుల భూములలో బీసీ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు దళితులకు ఎలాంటి సమాచారం తెలియ పరచకుండా వారి పొలం సర్వేనెంబర్ 65/ఆ లో పైపులైను వేయడం జరిగింది అట్టి విషయాన్ని వార్డు దళిత సభ్యులు పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అట్టి విషయం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు సమాచారం తెలిసింది. అందుకు కమిటీ సభ్యులు క్షేత్రపాలశీలనకు ఈరోజు అనగా 19 జూన్ 2026 రోజున ఉదయం క్షేత్ర పరిశీలనలో పాల్గొని అక్కడ పరిస్థితిని వార్డు ప్రజల సమక్షంలో తెలుసుకోవడం జరిగింది. దళితుల భూములలో ఎలాంటి సమాచారం లేకుండా పైపులైను వేయడం చాలా బాధాకరమైన విషయమని అట్టి విషయాన్ని తీవ్రంగా ఖండించారు దళితుల భూములు అని వారికి సమాచారం ఇవ్వకుండా వారి భూముల్లోనే పైపులేని వేయడం సరైన పద్ధతి కాదని ఉన్నారు. కమిటీ సభ్యులు ద్యారపోగు వెంకటేష్ మాట్లాడుతూ దళితులపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గాని ఎలాంటి దాడులు గాని చేసిన వారు ఎంతటి వారైనా వారిని ఉపేక్షించేది లేదని తెలియజేశారు. దళితుల రైతు పొలంలో దౌర్జన్యంగా వేసిన పైప్ లైన్ ను తొలగించాలని వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు చింతకుంట విశ్వం బాబు మాట్లాడుతూ దళితులకు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెన్నంటి ఉండి చేదోడు వాదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు వార్డు లోని పెద్ద మనుషుల సమక్షంలో ఇప్పటికే వేసిన పైప్ లైన్ సరైంది కాదని దాన్ని తిరిగి వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ గొర్రెల కాపరి సంఘం అధ్యక్షులు కురుమూర్తి యాదవ్ అలాగే కౌన్సిలర్ భర్త నక్క రాజుగారు అలాగే మాజీ కౌన్సిలర్ వంగూరు గోపాల్ గారు వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పరిపాలనలో పడకేసిన మునిసిపాలిటీ అభివృద్ధి

### మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన బిజెపి కౌన్సిలర్లు



**అమరచింత, జూన్ 19 (సింగిడి):** అమరచింత మునిసిపాలిటీ ని అభివృద్ధి చేయడంలో అధికార కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బిజెపి కౌన్సిలర్లు ఎం రాజు, విధ విష్ణువర్ధన్ ఊ షన్న ఆరోపించారు. శుక్రవారం మున్సిపాలిటీని అభివృద్ధి చేయకపోవడం పట్ల మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. స్థానికంగా ఉన్న సమస్యలపై బీజేపీ కౌన్సిలర్ లు ఎం రాజు, వేద విష్ణువర్ధన్, ఊ షన్న మాట్లాడుతూ పాలక వర్గం ఏర్పడి 4 నెలలు గడిచినా అభివృద్ధి కి నోచుకోలేదని ఇది ప్రజాపాలననా రాష్ట్రపతి పాలన అన్నట్టు ప్రజలు కొడై కుస్తున్నపాలక వర్గం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు హడావిడిగా మంత్రి వాకిటి శ్రీహరి రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అవి ఇంకా అభివృద్ధికినోచుకోలేదన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో వార్డు కౌన్సెలర్‌ల శిక్షణ శిబిర కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పినట్లు ఏ పథకాలు కూడా ప్రజలు నోచుకోలేదు. మున్సిపాలిటీ లోని ప్రభుత్వ స్థలాలు గ్రామ కంఠంలో ఉన్న అవి కబ్జాకు గురైన సూచిక బోర్డులు పెట్టాలని అనేక సార్లు బీజేపీ నగర శాఖ తరపున వినతి పత్రాలు ఇచిన సూచిక బోర్డులు పెట్టలేదన్నారు. ప్రభుత్వ బీడీ దవాఖాన కోసం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అఖిల పక్షం ఆధ్వర్యంలో స్థలం చూపించాలని వినతి పత్రం ఇచ్చిన ఇంతవరకు మున్సిపల్ అధికారులు స్థలం కేటాయించలేదన్నారు. అలాగే పోస్ట్ ఆఫీస్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ లో రోడ్ కి ఇరువైపుల చిరు వ్యాపారస్తులు వ్యాపారాలకు వీలుగా ఉండేలా మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. గత 3 యేళ్ళుగా తైబజరు విషయం లో ఎవరంతకు వాళ్ళు రసీదు లు లేకుండా వసూలు చేయడం జమ ఖర్చులు చూపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే మున్సిపల్ సమావేశాలలో 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టి వాటి యొక్క వివరాలు అంశాల వారిగా చర్చలు జరపాలన్నారు. ప్రజా పాలన లో ఎలాంటి కార్యక్రమాలు చేయాలి ఏమి అభివృద్ధి కార్యక్రమాల చేయాలనే అజెండా లేకుండా. ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రతినిధుల సమావేశం లేకుండా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 99 రోజుల ప్రణాళికల్లో ఎలాంటి జమ ఖర్చులు చేశారు ఏ పనులు చేశారని ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. స్థానిక 10 వ వార్డు లోని ప్రభుత్వ స్థలాలలో సూచిక బోర్డులు ఎవరి ఒత్తిడి తో పెట్టడం లేదని మేనేజర్ తో తెలియజేశారు. అదేవిధంగా మంత్రి వాకిటి శ్రీహరి 15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వాటిని ఇంతవరకు ఎక్కడ పనులు ప్రారంభించడం లేదని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నరాల నారాయణ. క్యామ భాస్కర్, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి. మేర్వ అనిల్. తోకలి రవి గణేష్ కామ నగేష్ మంగ అనిల్ చాకలి రవి రాకేష్ తిరుమల నరసింహ అర్జున్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశపరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### • జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (సింగిడి):** జిల్లాలో జూన్ 21న నిర్వహించనున్న నీట్ – –2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడేందుకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా నిలవడం నిషేధమని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని, మైకులు, డీజేలు వినియోగించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని, విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్లలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ బృందాల నియామించడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా నిఘా బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని నిబంధనలు అతిక్రమించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# 21న యోగ కార్యక్రమం

**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 19(సింగిడి):** జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ నందు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయుష్ వైద్యులు మరియు నోడల్ అధికారి డా. రాఘవేంద్ర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 6.45 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ యోగా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తదితర ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

### కౌన్సిలర్ రామ్మూర్తి యాదవ్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 19 (సింగిడి) :** ప్రభుత్వ విద్యారంగానికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని 18వ వార్డు కౌన్సిలర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డు విజయ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను నోట్ బుక్స్ పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 250 కోట్లకు పైగా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటుచేసి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. విద్యతోనే ఏదైనా సాధ్యమని విద్యార్థులు కష్టపడి తమ లక్ష్యాలను ఏర్పరచుకొని ఆ దిశగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆహార నియమాలను సైతం గమనించాలని జంక్ ఫుడ్ ఫాస్ట్ ఫుడ్ వాటికి దూరంగా ఉంచాలని అన్నారు. త్వరలో తన వంతు సాయంగా విద్యార్థులకు టై, బెల్ట్ ,షూస్ అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రు నాయక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొంపెల్లి సుశీల, వార్డు అధికారి నాగార్జున, నాయకులు కరుణాకర్ రెడ్డి ,ధరావత్ నిఖిల్, వంశీ, ప్రేమ్ కుమార్ ,పుష్ప, రమేష్, చాంప్ల ,సైదులు, ఆర్పీ శైలజ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన ఎన్‌సిసి విద్యార్థులు



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 19 (సింగిడి):** 31 తెలంగాణ టి బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్ సిసి క్యాడేట్స్ కు నిర్వహించిన వివిధ పోటీలలో సూర్యాపేట పట్టణంలోని ఎస్వి డిగ్రీ కళాశాల ఎన్సిసి విద్యార్థులు తమ ప్రతిభను చాటారని కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్ట్ క్యాడేట్‌గా డి.అఖిల మొదటి స్థానం, 800 మీటర్లు పరుగు పందెంలో డి పల్లవి ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో ఏ.శిరీష ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ఏ.శిరీష, పాటల పోటీలో శ్రీజ మొదటి స్థానం లో గెలుపొందారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ సి సి విద్యార్థులు దేశ సేవలోనే కాకుండా ఇటువంటి పోటీలలో సైతం గెలుపొందడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలను కళాశాల పాలకమండలి అధ్యాపక సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి అధ్యాపకులు కవిత రవి పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## సమగ్ర పంటల విధానమే మేలు !

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి.

ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి.



ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదేఅర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టు బాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటు న్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు.

అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ౼ాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

## 'విశ్వామిత్రుడు' నుంచి 'విశ్వగురువు' వరకు

2025లో భారత్ - ప్రపంచ వేదికపై కొత్త పాత్ర, అంతర్గత సవాళ్లు...
మోడీ దౌత్యం, అభివృద్ధి సూచీలు
పాక్ విధానం - మూడు కోణాలు..

2014 వరకు భారత విదేశాంగ విధానం సాధారణంగా "ప్రతిస్పందించే" స్థితిలో ఉండేది. గత దశాబ్దంలో అది "చొరవ తీసుకునే" దౌత్యంగా మారింది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత్ తనను తాను కేవలం ప్రాంతీయ శక్తిగా కాకుండా, గ్లోబల్ సౌత్‌కు గొంతుగా, టెక్నాలజీ, భద్రతలో భాగస్వామిగా నిలబెట్టుకుంది. ఈ మార్పును మూడు అంశాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. విస్తరిస్తున్న భాగస్వామ్యాలు, అభివృద్ధి సూచీలలో పురోగతి, పాకిస్థాన్ పట్ల కొత్త విధానం.

భారత్‌కు ప్రపంచ
**సహకారం ఎంత పెరిగింది?**

నేడు భారత్‌కు 100కి పైగా దేశాలతో ప్రత్యక్ష వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. ఫ్రాన్స్‌తో సంబంధాలు "స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్" స్థాయికి చేరుకున్నాయి. ఫిబ్రవరి 2025లో మోడీ-మాక్రాన్ భేటీలో హెలికాప్టర్ తయారీ, ఎఐ డిజిటల్ టెక్నాలజీలలో సహకారానికి ఒప్పందాలు కుదిరాయి. ఈయూతో 2004 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది.

**ఆసియా-పసిఫిక్:**
సెప్టెంబర్ 2025లో సింగపూర్‌తో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ షిప్పింగ్, సివిల్ న్యూక్లియర్, స్కిల్లింగ్ రంగాల్లో కొత్త రోడ్‌మ్యాప్ ప్రకటించారు. సింగపూర్ భారత్‌కు ఆగ్నేయాసియాలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, 2014 నుంచి $175 బిలియన్ ఎఫ్ డి ఐ వచ్చింది.

ఆఫ్రికా: భారత్ +20 ప్రెసిడెన్సీలో ఆఫ్రికన్ యూనియన్‌ను +20 శాశ్వత సభ్యుడిగా చేర్చడం చారిత్రాత్మక మలుపు. ఇది మోడీ 2018లో ఉగాండా పార్లమెంట్‌లో ప్రకటించిన 10 మార్గదర్శక సూత్రాల కొనసాగింపు.

**ఫలితం:**
2024-25లో గయానా, నైజీరియా, ఉక్రెయిన్, పోలాండ్, ఆస్ట్రియా లాంటి దేశాలు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని పర్యటనను చూశాయి. దౌత్యం ఇప్పుడు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రక్షణ, టెక్నాలజీ, పెట్టుబడుల రూపంలో కనిపిస్తోంది.

**అభివృద్ధి సూచీలలో భారత్ ఎక్కడ ఉంది?**

ఆర్థిక వృద్ధితో పాటు మానవాభివృద్ధిలోనూ భారత్ క్రమంగా పైకి వస్తోంది.
హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ 2025 యూఎన్ డీపీ ప్రకారం భారత్ 193 దేశాల్లో 130వ స్థానంలో ఉంది. హెచ్ డి ఐ విలువ 2022లో 0.676 నుంచి 2023లో 0.685కి పెరిగింది. 1990 నుంచి 53% వృద్ధి, ఇది ప్రపంచ దక్షిణాసియా సగటు కంటే ఎక్కువ. ఆయుర్దాయం 72 ఏళ్లకు చేరడం రికార్డు.



**ఎస్డిజి ఇండెక్స్ 2025:**
మొదటిసారి భారత్ టాప్ 100లోకి ప్రవేశించింది -- 99వ స్థానం. 2017లో 116వ స్థానం నుంచి ఈ పురోగతి సాధించింది.

భారత్ ఇంకా "మీడియం హ్యూమన్ డెవలప్‌మెంట్" కేటగిరీలోనే ఉంది. కానీ స్కూలింగ్ సంవత్సరాలు, తలసరి ఆదాయం, ఆరోగ్యంలో స్థిరమైన మెరుగుదల కనిపిస్తోంది. మహిళా నేతృత్వ అభివృద్ధి, నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై దృష్టి ఈ పురోగతికి కారణం అని యూ ఎన్ డి పీ పేర్కొంది.

**పాకిస్థాన్ విధానం:**
సహనం నుంచి సున్నా సహనం వరకు
మోడీ ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల విధానంలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చింది. సైనిక ప్రతిస్పందన. 2025 ఏప్రిల్ పహల్గాం దాడి తర్వాత "ఆపరేషన్ సిందూర్" ద్వారా భారత్‌రాశీఖలో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆకాశ్‌తీర్ వాయు రక్షణ వ్యవస్థ కీలక పాత్ర పోషించింది.

**దౌత్య ఒత్తిడి:**
భారత్ ఎఫ్ ఎ టీ ఎఫ్ లో పాకిస్థాన్‌ను మళ్లీ "గ్రే లిస్ట్"లో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారి చెక్ పోస్ట్ మూసివేయడం ద్వారా ఆర్థిక మరియు దౌత్య ఒత్తిడి పెంచింది. "ఉగ్రవాదం మరియు చర్చలు కలిసి సాగవు. ఉగ్రవాదం మరియు వాణిజ్యం కలిసి సాగవు" అని భారత్ స్పష్టం చేసింది. చర్చలు జరిగితే అది ఉగ్రవాదం మరియు ౼ాశీఖ గురించి మాత్రమే అని తేల్చి చెప్పింది.

**పాకిస్థాన్ స్పందన:**

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్ దాడిని "రాజకీయ లబ్ధి" కోసం అని ఆరోపించారు. అంతర్జాతీయ సమాజాన్ని ఒప్పించడంలో పాకిస్థాన్ పాక్షికంగా సఫలమైంది అని కొందరు విశ్లేషకులు అంటున్నారు. అయినా భారత్ చర్యలు పాకిస్థాన్‌ను రక్షణాత్మక స్థితిలోకి నెట్టాయి అనేది వాస్తవం.

**మార్గం ముందుకు: పౌరుడి పాత్ర**

ప్రభుత్వ దౌత్యం, సైనిక శక్తి ఒక్కటే సరిపోదు. దేశాభివృద్ధిలో పౌరుడి పాత్ర కీలకం. నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాలను వ్యక్తిగత స్థాయిలో వినియోగించుకోవాలి.
స్థానిక బాధ్యత: పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం - - మార్పు ఊరి నుంచే మొదలవ్వాలి.
ఐక్యత: కుల, మత, భాషా భేదాలను దాటి "భారతీయుడు" అనే గుర్తింపును ముందు పెట్టాలి.

**సమాచార అక్షరాస్యత:**
తప్పుడు వార్తలను గుర్తించి, దేశ భద్రతకు సంబంధించిన విషయాల్లో బాధ్యతగా వ్యవహరించాలి.

**అవకాశాల దశాబ్దం**

2025 నాటికి భారత్ ఒక మలుపులో నిలబడింది. ఒకవైపు ప్రపంచం భారత్‌ను టెక్నాలజీ, డిఫెన్స్, డెమోక్రసీకి భాగస్వామిగా చూస్తోంది. మరోవైపు అంతర్గతంగా హెస్ డి జి సూచీల్లో ఇంకా చాలా చేయాల్సి ఉంది. పాకిస్థాన్ నుంచి వచ్చే ఉగ్రవాద సవాలు కొనసాగుతూనే ఉంది.

ఇది ఆశావహ దృక్పథంతో చూడాల్సిన సమయం. ప్రభుత్వం మార్గం వేసింది. ఇప్పుడు ఆ మార్గంలో నడిచి, దేశాన్ని "వికసిత్ భారత్"గా మార్చే బాధ్యత 140 కోట్ల పౌరులది.



ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

## దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

### పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు



**న్యూఢిల్లీ,జూన్19(సింగిడి):** దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితంరోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1.46 లక్షలకు పడిపోయింది.సిల్వర్ ఫ్యూచర్స్ ధరరూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగి యడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి.అటు డాలర్‌తోపోలిస్తే మన కరెన్సీరూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

## మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

### కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం
### కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం

**చెన్నై,జూన్19(సింగిడి):** కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తిశాఖకు, కేంద్ర నీటి వనరులకుశాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశ ఎట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతోపాటు.సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్య మంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధిం చిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్య మంత్రిప్రవేశపెట్టిన ఈతీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

## తెలుగు సినీ గీత రచనకు ఆద్యులు చందాల

తెలుగు సినిమాలలో తొలి పాటను రాసింది ఎవరో తెలుసా? అలాంటి అవసరం, అవకాశం, సందర్భం రాలేదనుకుంటా. 1931లో తీసిన తొట్టతొలి తెలుగు టాకీ చిత్రం భక్త ప్రహ్లాదలో పరితాప భారంబు భరియింప తరమా అనే పాటను రాసింది బహుముఖ ప్రజ్ఞాశాలి చందాల కేశవదాసు. అంతేకాదు ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయకుంటే, ఆ మహనీయునికి తీరని అన్యాయం చేసిన వారం అవుతాం.

చందాల కేశవదాసు (జూన్ 20, 1876 - మే 14, 1956) తొలి తెలుగునాటక కర్త, తొలి సినీ గీత రచయిత, కవి, నటులు,గాయకులు,హరికథాకళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్పకీర్తనను,తెలుగు ప్రజలహృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే.

కేశవదాసు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని జక్కేపల్లిలో 1876 జూన్ 20వ తేదీన చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు.

తండ్రి చిన్నతనంలోనే మరణించడంతోవీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించారు. ఛందస్సు, అవధానాధి ప్రక్రి యలు నేర్చుకున్నారు. విద్యాభ్యాస అనంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పు సాధించారు.

అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం ఏర్పడి, కాంతయ్య ద్వారా సంగీతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచనలో, సంగీతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాసు ఆరితేరారు. కాంతయ్యనాటక సమాజంలోచేరి కవిగా, నటుడిగా పేరుగాంచారు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజువేషం వరకు ఏవేషమైనా వేసి మెప్పించగల సమర్థులు. మైలవరం కంపెనీకి శ్రీకృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసిచ్చారు.

అలా శ్రీకృష్ణ తులాభారం కోసం 'భలే మంచి చౌక బేరము సమయము మించినన్ దొరుకదు', నాటకాల్లో మొదట పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర'అనే సుప్రసిద్ధ కీర్తన కేశవదాసు రాశారు. భక్త ప్రహ్లాద, కనకతార వంటి చిత్రాలకు కేశవదాసు మాటలు, పాటలు వ్రాశారు. 1930-33ల మధ్య కేశవదాసు వ్రాసిన జాతీయ గీతాలను సినీ గాయకుడు సాలూరు రాజేశ్వర రావు, అముల నరసింహా రావులు పాడగా బెంగుళూరులో రికార్డు చేశారు. ఈయన అనేక సినిమా స్క్రిప్టులతో పాటుగా, కేశవ శతకం, బలి బంధనం,సీతాకళ్యాణం,రుక్మాంగద, మేలుకొలుపులు, జోల పాటలు మొదలైన రచనలు చేశారు. బాల భారత్ సమాజం వారు ఆయన ఆధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. "కనక తార", "లంకా దహనం" వంటి నాటకాలను సినిమాలుగా కూడా తీసారు.

నాటక రంగంలో చందాల కేశవదాసు మంచి పేరుతో ఒక వెలుగు వెలిగిపోతున్న సమయంలో సినిమా రంగం ఆహ్వానం పలికింది. అప్పటి దాకా భారతదేశ మంతటా మూగ సినిమాలు ఆడేవి. 1931 మార్చి 15న దేశంలో తొలిసారిగా 'ఆలం ఆరా' అనే మాటలతో కూడిన సినిమా వచ్చింది. ఇదే తొలి భారతీయ టాకీ.అదే యేడాది తెలుగులో కూడా టాకీ చిత్రం తీయాలనుకుని భక్త ప్రహ్లాద చిత్రం (1931-32)న ప్రారంభించారు. ఆ చిత్రంలో పాటలు రాయడానికి మన చందాల కేశవదాసును పిలవడంతో ఆయన సినీ జీవితం మొదలైంది.



ఈచిత్రంలో ప్రహ్లాదునిగా కృష్ణాజిరావు షిండే, హిరణ్య కశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలా బాయి నటించారు. చిత్రంలో ఈమె పాడిన పరితాప భారంబు భరియింప తరమా పాటనే చందాల కేశవదాసు సినిమాకు రాసిన తొలిపాట.

*పరితాప భారంబు భరియింప తరమా...కటకట నే విధి*
*గడువంగ జాలుదు పతి ఆజ్ఞను దాట గలనా*
*పుత్రుని కాపాడ గలనా .....పరి...*
*ఈ విషము నేనెటులను*
*తనయుని ద్రావింపగలను?*
*ధర్మమును కాపాడుదునా?*
*తనయుని కావగగలనా? .... పరి...*

అలాగే... తనయా ఇటులన్ తగుపలుకు, మునిపల్లె సుబ్బయ్య పాడిన భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక ఇటు చేసెదవా రెండు పాటలు కూడా చందాల రాశారు.

అలా చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ కవిగా చరిత్రకెక్కారు. తొలిచిత్రం భక్త ప్రహ్లాద (1931-32)కు రాసిన పాటలు,1942లో తీసిన భక్త ప్రహ్లాదలోనూ వాడుకున్నారు. శ్రీకృష్ణ తులాభారం (1935)లో రాసినపాటలు ఆ తరువాత 1956,1966లోనూ అందుకే ఆయన తెలుగు సినిమా వాచస్పతిగా చరిత్రకెక్కారు.

'భక్త ప్రహ్లాద' (1931-32) తరువాత కేశవదాసు గారు రచయితగా పని చేసిన సినిమా 'సతీ సక్కు బాయి' (1935). భారతలక్ష్మీ ఫిలింస్ వారి ఈచిత్రంలో 'కృష్ణా పోబోకురా', 'రాదేల కరుణా','ఆటలాడు కోరా','పాలుమీగడ పలుమార్లు భుజియించి', 'పాషాణ మెటులైతివో', 'జాగేలా కావగ రారుగా' పాటలు రాశారాయన.

శ్రీకృష్ణతులాభారం' ముత్తరాజు సుబ్బారావు రాసిన రంగస్థల నాటకం తొలిసారిగా చిత్ర రూపం దాల్చి 1935లో విడుదలైంది.జయసింగ్ కృష్ణుడు,ఋష్యేంద్ర మణి సత్యభామ, కపిలవాయి రామనాథశాస్త్రినారదుడు.ఋష్యేంద్ర మణి, కాంచనమాల, రేలంగి,లక్ష్మీరాజ్యం వంటి నటులకు ఇదే తొలి చిత్రం! 1955లో రాజరాజేశ్వరీ వారు ఇదే చిత్రం తీశారు. సి.ఎస్.రావు దర్శకుడు కాగా, రఘురామయ్య కృష్ణుడు, సూరి బాబు నారదుడు, ఎస్.వరలక్ష్మి సత్యభామ. ఇక 1966లో డి.రామానాయుడు సురేష్ పతాకం కింద మళ్లీ 'శ్రీ కృష్ణ తులాభారం' తీశారు. రామారావు కృష్ణుడు, కాంతారావు నారదుడు, జమున సత్యభామ, కమలాకర రామేశ్వరరావు దర్శకుడు. 1935 లో సి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన కాశీ ఫిలింస్ వారి శ్రీకృష్ణ తులాభారం'లో ఆయన రాసిన మూడు పాటలు... భలే మంచి చౌకబేరము, మునివరా తుదికిట్లు నానున్ మోసగింతువా, కొట్టు కొట్టండి బుర్రపగలు గొట్టండి.ఈ మూడు పాటలను ఆ తరువాత మరో రెండుసార్లు శ్రీకృష్ణ తులాభారం చిత్రాన్ని1955,1966ల్లో నిర్మించినపుడు కూడా వాడుకున్నారు.

1935లో అరోరా ఫిలిమ్స్ ఆరోరా ఫిలిమ్స్ వారు 'అనసూయ' చిత్రాన్ని కోల్‌కత్తాలో తీశారు. ఈ సినిమాకి మాటలు, పాటలు, పద్యాలూ అన్నీ కేశవదాసే రాశారు.1935లో సతీ అనసూయ, ధ్రువవిజయం, సినిమాలకు రచయితగా పని చేశారు. చందాల కేశవదాసు1936లో వచ్చిన 'లంకాదహనం' సినిమాకు కూడా మాటలు, పాటలు, పద్యాలూ రాశారు. కనక తారకు రాసినకథ, పాటలు 1937, 1956లోనూ యథాతథంగా ఈ సినిమాల్లో వినియోగించు కున్నారు. మైలవరం కంపెనీ వారి బాలభారతి సమాజం పక్షాన నాటక ప్రదర్శన కోసం పలు ప్రాంతాలు తిరిగారు.హరికథలు చెప్పడంలో కేశవదాసుది అందెవేసిన చేయి. అష్టావధానిగా, హరిదాసుగా నాటితెలుగు సమాజంలో కేశవదాసుది ఒక ప్రత్యేక స్థానముండేది.స్వాతంత్ర్య సమర సమయంలో గాంధీజీ విధానాలకు ముగ్ధుడై గాంధీని తన రచనలతో ప్రశంసించకుండా వుండలేక పోయారు. "జయతు జై" అంటూ పాట రాయడమే కాక దానిని ఆకుల నరసింహారావు, సాగి రాజేశ్వర రావులతో పాడించి బెంగుళూరులో స్వంత ఖర్చులతో రికార్డు చేయించి ఉద్యమానికి దోహదకారి అయ్యేలా దానిని విడుదల చేసారు.

తన కళా ప్రదర్శనల ద్వారా పొందిన బంగారు కంకణాలను, పతకాలను దాచుకోకుండా సత్కార్యాలకోసం ఖర్చుచేసి మార్గదర్శకంగా నిలిచాడు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి త్రవ్వించి, భోజన, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు.తనఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కలపను సీతారామ చంద్రస్వామి రథగోపుర నిర్మాణానికి వాడారు.తమ్మరలోగాలిగోపురం, ధ్వజస్తంభం పనులు డబ్బులేక ఆగిపోతే ఇంటికి మనిషిని పంపించి బార్యచేతి బం గారు గాజులు తెప్పించి అమ్మారు. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ దగ్గర్లో వున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ కావించారు. భద్రాచలం తిరువూరు మార్గం నుండి వేళ్లే భక్తులకు తిరువూరులో సత్రాలు ఏర్పాటు చేశారు. స్వంత ఖర్చుతో వీటిల్లో భక్తులకు ఉచిత అన్న దానం చేశారు. కోదాడ మండలం తమ్మరలో సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు.

రజాకార్లు జక్కేపల్లిలో కేశవదాసు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఆ దాడిలో ఆయన ఆస్తిపాస్తులు, ధనమే గాక అంతకన్న విలువైన ఆయన సాహిత్య సంపద కూడా నాశనమైనది. కేశవదాసు 1956 మే 14న అంటే దుర్ముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం లో మరణించారు.

.రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ప్రభాతవల సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
20-6-2026

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

**ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలి**
**సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే**



**గద్వాలబ్యూరో19 (సింగిడి) :** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగ్ లో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాజెక్టుల ఆవశ్యకత, ప్రభుత్వ అవసరాల గురించి వివరించి ఒప్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం ఆయా మండలాల వారీగా వివిధ గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై సంబంధిత మండలాల అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# జీడిమెట్ల పరిశ్రమలు మరిన్ని ఉద్యోగాలకు నాంది పలకాలి

**పీఎంవీబీఆర్‌వై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపు**

**కుత్బుల్లాపూర్, జూన్ 19 (సింగిడి):** ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. శుక్రవారం జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రాంతీయ ఉపాధి కార్యాలయం ( ఆర్ ఓ ), కూకట్‌పల్లి ఆధ్వ ర్యంలో నిర్వహించిన ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ( పి ఎం- వి బి ఆర్ వై ) లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిస్తున్న యువతకు ప్రారంభ దశలో ప్రోత్సాహం అందించేందుకు ఫస్ట్ టైమర్ ఉద్యోగులకు రూ.15,000 వరకు ఒకేసారి ప్రోత్సాహక నగదు అందించడం ఈ పథకం ప్రత్యేకత అని తెలిపారు. దీంతో యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉద్యోగ రంగంలో మరింత సమర్థవంతంగా రాణించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అదనపు ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఉపాధి సృష్టిని వేగవంతం చేయడమే కాకుండా, దేశంలో అధికారిక ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూకట్‌పల్లి (కేపీ) సర్కిల్ కుత్బుల్లాపూర్ జోన్ తో సహా ఈ పథకం ద్వారా 242 యజమానులు సుమారు రూ.2.39 కోట్ల ప్రోత్సాహకాలను పొందగా, 9,841 మంది ఉద్యోగులు సుమారు రూ.5.29 కోట్ల ప్రయోజనాలను పొందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ గణాంకాలు ఉద్యోగ కల్పనలో పరిశ్రమలు, యువత చురుకుగా భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మరిన్ని సంస్థలు లబ్ధి పొందడంతో పాటు స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తయారీ రంగంలోని సంస్థలకు నాలుగు సంవత్సరాల పాటు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విస్తరణకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తోందని, ఇక్కడి పరిశ్రమలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యువతకు ఉపాధి, పరిశ్రమలకు ప్రోత్సాహం, దేశానికి అభివృద్ధి అనే త్రిసూత్రంతో ఈ పథకం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పి.ఎఫ్. కమిషనర్ సురేందర్ కుమార్, పి.ఎఫ్. ఉప కమిషనర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఎన్.ఐ.సి. హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్, అలాగే జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు కె. సాయి కిషోర్, సభ్యులు, పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి),లో

# దిగ్విజయంగా పూర్తైన అన్న-అక్కశిక్షణ



**హైదరాబాద్ ప్రతినిది, జూన్ 19 (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థుల లో కృత్రిమ మేధ పై కళాశాల విద్యా ర్థుల తో అవగాహన కల్పించే శిక్షణ జయప్రదంగా పూర్తైందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కెప్టెన్ ఎం.విజయ్ కుమార్ తెలిపారు. టీచింగ్ ఇంటర్న్‌షిప్ ఆన్ ఏఐ అండ్ డిజిటల్ లెర్నింగ్" కార్యక్రమం 17, 18 తేదీలలో కళాశాల కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ముగింపో త్సవంలో వారు అధ్యక్ష ఉపన్యాసమిస్తు అన్న-అక్క మెంటర్న్‌షిప్ కార్యక్రమం బహుళ ప్రయోజనాల కార్యక్రమమని పేర్కొన్నారు. దీంతో ఏఐ పట్ల పాఠశాల విద్యార్థులకు చక్కటి అవగాహన ఉప యోగాల అంశాలను తెలుసుకునే అవ కాశం ఉందన్నారు. అదేవిధంగా కాలేజీ చివరి ఏడాది విద్యా ర్థులకు నేతృత్వం-కర్తృత్వం-వ్యక్తిత్వ వికాసం దోహద పడుతుందని వివరిం చారు. విద్యార్థుల ద్వారా విద్యార్థులకు ఆధునిక నైపుణ్య వికాస మెళుకువలు గైకొనే అవకాశం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య శిక్షిగగా విచ్చేసిన స్టెన్లీ ఇంజినీరింగ్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. శ్రీలత శిక్షణలో భాగంగా ఏఐ పై అవగాహన-ఆవశ్యకతపై సుదీర్ఘమైన ఉపన్యాసంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ లో వివిధ ప్రయోగాలు చేయించారు. ఈ సందర్భంగ ఇప్పటివరకు కంప్యూ టర్ల వాడకం రాకపోతే విద్యావంతులు కారనుకునేవారు కాని ఇప్పుడిక ఏఐ పై అవగాహన లేకపోతే మనుగడే సాధ్యం కాదన్న సత్యం అందరు గుర్తించాల న్నారు. జులై ఒకటో తేదినుండి ఆరంభమయ్యే ఈ లిఅన్న-అక్క మెంటర్షిప్‌లి కార్యక్రమం నెలరోజుల పాటు ప్రతిరోజు రెండు కాలాంశాలలో అనగా గంటన్నర పాటు పాఠశాలలో ఉండి తిరిగి కళాశాలల కెళ్ళవలసి ఉంటుందని ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. కళాశాల నోడెల్ ఆఫీసర్లుగా డాక్టర్.కడారి శ్రీనివాస్, డాక్టర్.సి. రాజేశ్వర్, డాక్టర్.చెన్నూరు అరుణలు విద్యార్థుల ఎంపిక కార్యక్రమ యోజ నలో కీలకపాత్ర పోషిస్తున్నారు. సి.వి.ఎల్.నారాయణ, దత్తసాయి ఎనెస్సెస్ అధికారులు చేయుత నందిం చారు. వైస్-ప్రిన్సిపాల్స్ డాక్టర్.కలువల శ్రీనివాస్ రావ, పి. సత్యనారాయణ రెడ్డి, పెద్ద ఎత్తున అధ్యాపక కులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యా రంగంలో చారిత్రాత్మక ముందడుగు

**పరిశ్రమ-అకాడమియా సహకార గ్యాలరీ ప్రారంభం..**
**100కు పైగా సంస్థలతో ఒప్పందాలు..**



**హైదరాబాద్ ప్రతినిధి,జూన్ 19(సింగిడి):** రాష్ట్ర ఉన్నత విద్యా రంగాన్ని పరిశ్రమలు, నాలెడ్జ్ భాగస్వాములతో అనుసంధానిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఒక వినూత్నమైన అడుగు వేసింది. హైదరా బాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి వర్యుల సమక్షంలో 'పరిశ్రమ-విద్య సహకార గ్యాలరీ: ఉన్నత విద్య రూపాంత రానికి భాగస్వామ్యాల వేడుక'ను అత్యంత వైభవంగా నిర్వహించారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా ఉన్నత విద్యా వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ నిబద్ధత కు ఈ కార్యక్రమం అద్దం పట్టింది. ఈ గ్యాలరీ ఉద్దేశాన్ని వివరిస్తూ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్.యోగితా రాణా పేర్కొన్న వివరాల ప్రకారం... కళాశాల, సాంకేతిక విద్యాశాఖల అపూర్వ కృషి ఫలితంగా పరిశ్రమలు, సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లు, సిఐఐ, ఐఐటి హైదరాబాద్, ఐఎస్‌బి వంటి 100 కంటే ఎక్కువ ప్రముఖ సంస్థలతో అధికారి కంగా ఒప్పందాలు కుదిరాయి. కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాకుండా, విద్యా వ్యవస్థలోనే పారిశ్రామిక భాగస్వా మ్యాన్ని ఒక భాగం చేయడం దీని ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగానే 'సైయెంట్ ఫౌండేషన్' మూడేళ్ల కాలానికి రూ. 7.5 కోట్ల పెట్టుబడి నిబద్ధతతో ప్రభుత్వ కళాశాలలు, పాలిటెక్నిక్‌లలో ఎంటర్‌ప్రె న్యూర్‌షిప్, స్టార్టప్ ఇన్‌క్యుబేషన్, హాకథా న్‌ల నిర్వహణకు కీలక ఒప్పందం చేసుకుంది. ఈ భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులకు స్టైపెండ్‌తో కూడిన పారిశ్రా మిక శిక్షణ, అప్రెంటిస్‌షిప్‌లు, అధ్యాప కులకు శిక్షణ లభిస్తాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్ ఈ గ్యాలరీని సందర్శించి, పారిశ్రామిక ప్రముఖులతో ముచ్చటించి, విద్యాశాఖ ప్రయత్నాలను అభినందించా రు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఇటీవలి కాలంలో సాధించిన అద్భుత విజయాలను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు. కళాశాల విద్యాశాఖ అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు విస్తరించి, కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత ఏడాది కంటే 11,000 పైగా అదనపు ప్రవేశా లతో 28శాతం వృద్ధి నమోదైంది. అలాగే సాంకేతిక విద్యాశాఖ సెమీకండక్టర్స్, రోబోటిక్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో 10 కొత్త కోర్సులను ప్రవేశపెట్టి, రికార్డు స్థాయిలో 92శాతం అడ్మిషన్ రేటును సాధించింది. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రతిభ, ఆవిష్కరణల కేంద్రంగా మార్చడంలో ఈ పరిశ్రమ-అకాడమియా నమూనా ఒక మైలురాయిగా నిలుస్తుందని డాక్టర్. యోగితా రాణా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సైయెంట్ ఫౌండేషన్ అధినేత బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, సిఐఐ ప్రతినిధి శేఖర్ రెడ్డి, కళాశాల, సాంకేతిక విద్యాశాఖల కమిషనర్ ఎ. శ్రీదేవసేన (ఐఏఎస్), సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్. బాల భాస్కర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే బిఆర్ఎస్ బలం





**సమన్వయంతో పనిచేయండి**
**కాంగ్రెస్ పాలనలో ఎద్దుకంట, రైతు కంట కన్నీరు**
**సభ్యత్వ నమోదు ను జయప్రదం చేయండి**
**కేసీఆర్‌ను తిట్టడం తప్పా రేవంత్ రెడ్డి చేస్తున్నదేం లేదు**
**ప్రజలు కాంగ్రెస్ ను విశ్వసించడం లేదు**
**మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి**

**కొడంగల్, జూన్ 19(సింగిడి) :** కష్టకాలంలో పార్టీ కి అండగా నిలిచిన కార్యకర్తలే బిఆర్ ఎస్ పార్టీ కి బలం అని మాజీమంత్రులు శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి లు అన్నారు. శుక్రవారం కొడంగల్ లోని రాఘవేంద్ర గార్డెన్ లో నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల, డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు ఎస్ ఐ ఆర్ పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లా డుతూ,రెండున్నరేళ్ళ పాలనలో రేవంత్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయే పనులేమీ చేయలేదని ఎద్దేవా చేశారు.సభలు పెట్టి కెసిఆర్ ను కెసీఆర్ కుటుంబాన్ని తిట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేస్తున్నదేం లేదన్నారు. అడుగడుగునా స్కాం లు జరుగుతున్నాయని మండిప డ్డారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. పార్టీ బలోపేతానికి సమన్వయం తో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఎద్దు కంట,రైతు కంట కన్నీరు కారుతుందని, ఇది రాష్ట్రానికి అరిష్టం అన్నారు.గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ ను విశ్వసించడం లేదని, ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు.రెండేళ్ళ లో మళ్ళీ బిఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదు లో బూత్ ల వారిగా అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు.ప్రతి ఓటు చాలా విలువైందని,18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ఎస్ ఐ ఆర్ విషయం పై మాట్లాడుతూ,ఓట్ల తొలగింపు విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని,సూచించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు అందించే విత్తనాలను అమ్ముకున్న కాంగ్రెస్ నాయకులపైన కేసులు నమోదు చేసి, జైలు పంపాలని డిమాండ్ చేశారు. కొడంగల్ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని, ఎందాకైనా ప్రజల తరఫున కొట్లాడతానని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్,పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్, పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శేరి నారాయణరెడ్డి, కోట్ల యాదగిరి, చాంద్ పాషా,కోట్ల మైపాల్, ఎర్రన్ పల్లి శ్రీనివాస్,లగచర్ల సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ సర్పంచ్..!

**ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించిన సర్పంచ్..వార్డు సభ్యురాలు.**




**పాలేరు జూన్ 19( సింగిడి :** ప్రభుత్వ పాఠశాల లను బలోపేతం చేయండి...పిల్లలను బడిలో చేర్పించండి అని ప్రచారం చేసే ప్రజాప్రతినిధులను చూశాం..కానీ ముందుగా వారి పిల్లలను బడిలో చేర్పించి... తరువాత ప్రచారం ను ప్రారంభించారు. నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ భూక్యా మౌనిక కుమారుడు గతంలో ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాల ను బలోపేతం లో తాను పాలుపంచుకోవాలని లక్ష్యంతో తన కుమారుడు ను శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అదే విధంగా స్థానిక పంచాయతీ వార్డు సభ్యురాలు కూరపాటి మాధవి కుమారుడు, కుమార్తె .లు ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారు. కాగా ఆమె కుమార్తె 4 వ 'తరగతి లో, కుమారుడు 1 వ తరగతి లో చేర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మౌనిక మాట్లాడారు...మన ఊరి బడి ని మనమే బ్రతికిం చుకోవాలి...ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని చేర్పించినట్లు తెలి పారు. దీంతో గ్రామంలో మరి కొంత మందిని బడిలో చేర్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బాబురావు, ఉపాధ్యాయులు యం.వీరబాబు, చిన్నా పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

**సీతారామ ప్రాజెక్టు భూసేకరణ పురోగతిని వివరించిన కలెక్టర్ అంకిత్**





**అశ్వాపురం: జూన్ 19 (సింగిడి):** జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మొదటి పంప్‌హౌస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం, బీజీ కొత్తూరులోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మొదటి పంప్‌హౌస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు, సర్వే పనులు, కోర్టు కేసుల పురోగతిపై ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. ప్రాజెక్టుల అమ లులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు న్యాయమైన పరిహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవార్డుల జారీ మరియు పరిహారం చెల్లింపుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫేజ్-1 కింద 1,522 ఎకరాల భూసేకరణకు సంబంధించిన మొ త్తం అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఫేజ్-2లో 2,365 ఎక రాలకు అవార్డులు జారీ చేసి, భూనిర్వాసితులకు పరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు. ఫేజ్-3లో 1,621 ఎకరాలకు గాను 1,350 ఎకరాలకు అవార్డులు జారీ చేయగా, 903 ఎకరాలకు పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూములకు సంబంధించి ప్రభుత్వ నిధులు అందిన వెంటనే పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీలు-1,2, 6లకు సంబం ధించిన భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. అలాగే సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కమిషనర్‌కు వివరించారు. భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌డీఎల్‌సీలు రవీంద్రనాథ్, వెంకట్రావు, మండల తహసీల్దార్లు, భూసేకరణ విభాగ అధికారులు రమేష్, యాసీన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పాలవరం డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి...



**కోదాడ,జూన్ 19(సింగిడి):** అనంతగిరి మండలం పాలవరం గ్రామంలోని ప్రధాన రహదారి నిర్మాణ సమయంలో పాత డ్రైనేజీ తొలగించడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి నూతన డ్రైనేజీ నిర్మించాలని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేసి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**ఖమ్మం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవిబాబు**




**వైరా,జూన్19(సింగిడి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు, విద్యాబోధనలో ప్రైవేటుకు దీటుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని ఖమ్మం జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి రవిబాబు అధ్యాపకుల ను కోరారు. శుక్రవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ వాసం వీరస్వామి అధ్యక్షతన జరిగిన అధ్యాపకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలలో పనిచేస్తున్న అధ్యాపకులు అంకిత భావంతో కృషి చేసి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల నిర్వహణతో పాటు, ప్రాక్టికల్ పరీక్షలు కూడా అన్ని సబ్జెక్టులలో నిర్వహించాలన్నారు. సైన్స్ అధ్యాపకులు పాఠ్యపుస్తకాల విజ్ఞానంతో పాటు, నర్సరీ లాంటి అంశాలలో ప్రాక్టికల్స్ చేయించాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సులలో చదువుతున్న విద్యార్థులకు రోబోట్ టెక్నాలజీ లో వస్తున్న నూతన పరిణామాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. వృత్తివిద్యా కోర్సులలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తో పాటు విద్యార్థులు ప్రతినిత్యం కాలేజీకి వస్తున్నారా లేదా అనే అంశం పట్ల కూడా అధ్యాపకులు దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల హాజరు సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. విద్యా ప్రణాళిక పరంగా వివిధ అంశాలపై అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు పంపించిన తెలుగు అకాడమీ ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పోలియో, స్టాప్ డయేరియా, నులిపురుగుల నివారణను జయప్రదం చేయండి


## కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




**హనుమకొండ, (సింగిడి):**
పోలియో నిర్మూలనతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయం తో విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వ హించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్, ఆయా కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ని 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరుగు తున్న ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క చిన్నారినీ కూడా మిగిలి పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ట్రాన్సిట్ పాయింట్లతో పాటు అన్ని పోలియో కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమం విస్తృతంగా జరిగేలా స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు భాగస్వామ్యం కావాలని కోరారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని తెలిపారు. పాఠ శాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించా రు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాం కుమార్ మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహిం చనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 84, 298 మంది 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 472 పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా కార్యక ర్తలు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేయడంతో పాటు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడతారని వివరించారు. జూలై 13, 20 తేదీల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లల కు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థు లందరికీ ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డి ఆర్ ఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ శేషాద్రి పంచాయతీరాజ్, మహిళా మరియు శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గనిలో పేలుడు...
# కార్మికుడికి తీవ్ర గాయాలు

**కేటీకే - 5 గనిలో బ్లాస్టింగ్ సమయంలో ప్రమాదం**



**భూపాలపల్లి ,( సింగిడి)**
సింగరేణి భూపాలపల్లి ఏరియాకు చెందిన కేటీకే -5 గనిలో సోమవారం ప్రమాదం చోటు చేసుకుంది. బొగ్గు ఉత్పత్తి కోసం నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ పనుల సమయంలో పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం ప్రకారం, కేటీకే -5 గనిలో మొదటి షిఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న షార్ట్ ఫైరర్ శ్రీరాముల ప్రదీప్13 వ లెవెల్ లో బ్లాస్టింగ్ పనులు చేపట్టాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అతని చేతిలో ఉన్న పేలుడు పదార్థం పేలినట్లు తెలుస్తుంది. ఘటనలో ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుళ్ల శబ్దం వినిపించడంతో అప్రమత్త మైన తోటి కార్మికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన ప్రదీప్ ను బయటకు తీసుకొచ్చారు. అనంతరం భూపాలపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రత్యేక ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై సింగరేణి అధికారులు ఆరా తీస్తుండగా, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు సమాచారం ఈ ఘటనలో గనుల్లో భద్రత ప్రమాణాల అమలు, పేలుడు పదార్థాల నిర్వహణపై మరోసారి చర్చ మొదలైంది.

# జర్నలిస్టుల పిల్లలకు
# 50% ఫీజు రాయితీ కల్పించాలి



**భూపాలపల్లి (సింగిడి):**
జిల్లాలోని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజానికి సమాచార వారధులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలు మాత్రం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా ఫీజులు భారీగా పెరిగిపోవడంతో జర్నలిస్టులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో పనిచేస్తున్న విలేకరుల ఆదాయం పరిమితంగా ఉండటంతో విద్యా భారం మరింత పెరుగు తోందన్నారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారి పిల్లలకు ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక విధానం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు విజయ్, సుధా కర్, రామారావు, పవన్‌తో పాటు పలువురు విలేకరులు పాల్గొని వినతిపత్రా నికి మద్దతు తెలిపారు. జర్నలిస్టుల పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**- ఈ నెల 20న జాతీయ లోక్ అదాలత్**
**- సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కన్నయ్యలాల్**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (సింగిడి):**
ఈ నెల 20న నిర్వహించ బోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివి ల్ జడ్జి, న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి టి. కన్నయ్యలాల్ సూచించారు. న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్ తో సోమవారం వేరు వేరుగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసులోని ఇరువర్గాలవారు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బులు వృధా కావని, మనశాంతిని పొందవచ్చని వారు పేర్కొన్నారు. సివిల్ కేసుల్లో రాజి పడ్డవారికి చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి ఇవ్వబడుతుందని జడ్జి తెలిపారు. న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్ లోక్ ఆదాలత్ పై ప్రజలకు అవగహన కల్పించాలని, రాజీ మార్గాలు పాటించేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయవాదులు భూక్యా రమేష్ నాయక్, మొయినుద్దీన్, సంధ్య, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# 10 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్**



**అమరచింత, (సింగిడి):**
వనపర్తి జిల్లా సోషల్ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ వర్కర్స్ 10 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఖీమా నాయక్ కు సిఐటియు హాస్టల్ వర్కర్స్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్ మాట్లాడుతూ హాస్టల్ వర్కర్లు వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు, చెందిన వారే అత్యధికులుగా ఉన్నారు, వీరికి ఇలాంటి చట్టబద్ధత సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కనీసం గ్యారంటీ సూరిటి లేని వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదు, 10 నెలల నుంచి వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అని, ఇప్పుడు విద్యాసంస్థల ప్రారంభం కావడం జరిగింది. పిల్లల చదువులకు ఇబ్బందులుగా ఉన్నాయని, వానకాల సీజన్ ప్రారంభమవుతా ఉంది పనుల పెట్టుబడులకు, కుటుంబం అవసరాల రిత్య కూడా గడవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అమలు చేయడంలో మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మహిళా సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

**106 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని**



**హనుమకొండ, (సింగిడి):**
మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 106 మంది లబ్ధిదారులకు రూ.1,06,12,296 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి నెల రెండు పర్యాయాలు సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని లేదా తమ డివిజన్లలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతి నిధులను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకా ల అమలులో ఎలాంటి మధ్యవర్తులు, దళారులను నమ్మవద్దని, ప్రతి పథకం పూర్తిగా ఉచితంగానే అమలు అవుతోందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ ఈ నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


# ఒంటరైనా చిన్నారి భవ్యశ్రీకి ఆర్థిక సహాయం



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):**
పెద్దమందడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2005- 2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలి కూతురికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన రేణుక పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 లో పదో తరగతి చదివింది. నెల రోజుల క్రితం అనారోగ్యంతో అమె మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఒంటరి అయిన తన స్నేహితురాలి కూతురి కి తమ వంతు ఏమైనా సహాయం చేయాలని అనుకున్నారు. రేణుక కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్న స్నేహితులు తమతో పాటు చదువుకున్న స్నేహితురాలి కూతురు భవ్యశ్రీ కి అందరూ కలిసి జమ చేసుకున్న రూ.50,000 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ నగదు మొత్తాన్ని భవ్యశ్రీ పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చెయ్యాలని నిర్ణయించారు. భవిష్యత్తులో కూడా రేణుక కూతురు భవ్యశ్రీ కి చదువుల విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని చిన్నారికి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో 2005-06 బ్యాచ్ స్నేహితులు పాల్గొన్నారు

# ఫిర్యాదులపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలి

**జిల్లా ఎస్పీ సునీత రెడ్డి విజ్ఞప్తి**



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి)**
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై పోలీసు అధికారు లు, సిబ్బంది తక్షణమే స్పందిం చాలని జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం వన పర్తి జిల్లా పోలీసు కార్యాల యంలో నిర్వ హించిన ప్రజావా ణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 25 మంది పిర్యాదుదా రులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కలిసి ఫిర్యాదులు అం దించారు. ప్రతి ఫిర్యాదుపై ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలిం చి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధి కారులకు తక్షణమే సదరు ఫిర్యా దులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలి గించడంతో వచ్చిన ఫిర్యాదుదా రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 25 ఫిర్యాదులు అందా యని, అందులో 17 భూతగా దాల ఫిర్యాదులు, 8 పరస్పర గొ డవలకు సంబంధించిన ఫిర్యా దులు వున్నాయ ని ఎస్పీ వివరిం చారు.

# పాటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో యజ్ఞ మహోత్సవం



**గోపాల్ పేట, (సింగిడి):**
గోపాల్ పేట మండలం పోలికే పహాడ్ గ్రా మంలో సోమవారం శ్రీ పాటిగడ్డ ఆంజనే య స్వామి దేవాలయంలో సకలాభీష్టసిద్ధి, శ్రీ లక్ష్మీగణపతి యజ్ఞ మహోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాం గణంలో ఉన్న జగద్గురు శ్రీ ఆదిశంకరా చార్య వేద విద్యాశ్రమం వేద పాఠశాల విద్యార్థులకు జూలూరి సాయిబాబా కుటుం బ సభ్యులు ఆసనం, సరస్వతి పీఠం, జప మాలలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల ప్రధానాచా ర్యులు బ్రహ్మశ్రీ నారాయణదాసు లవకు మారాచార్యులు, కే.వి.నాగేంద్రమాచార్య, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జీతాలు పెంచాలని
# ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా



**అమరచింత, (సింగిడి):**
గ్రామపంచాయతీ వర్కర్స్ జీతాలు పెంచాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీతాలు పెంచాలని ధర్నా చేపట్టారు. ఈ ధర్నా శిబిరం బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారని నేడు మార్కెట్లో ఉప్పు ద్వారా పప్పు దొర నూనెదర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా ప్రభుత్వాలు జీతాలను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది జీతాలు పెంచడంలో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయి గ్రామపంచాయతీ వర్కర్స్ కి కనీసం 26వేల జీతం ఇవ్వాలి కానీ నేడు చెల్లిస్తున్న జీతం 9500 మాత్రమే వర్కర్స్ శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు ఆలోచించి గ్రామపంచాయతీ వర్కర్స్ కు తక్షణమే జీతాలు పెంచాలని ఈ వర్కర్స్ అందరు కూడా పని భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ కి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ మీ సమస్యలను అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వీటి పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాని విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ శాంతన్న రాములు గోవిందమ్మ భాగ్యమ్మ మాసన్న బాలయ్య హనుమంతు పెద్ద హనుమంతు తిరుపతయ్య కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## తొలి రోజే విద్యార్థులకు
# పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల పంపిణీ



**పెబ్బేరు,(సింగిడి):**
పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలో నూతన విద్యా సంవత్సరం 2026--27 ప్రారంభమైన తొలి రోజునే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాం క్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యాసన సామర్థ్యాలకు అను గుణంగా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఇంగ్లీష్ మీడియంలో బోధన అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే అన్ని తరగతులకు డిజిటల్ బోధన (ఐఎఫ్‌పీ ద్వారా), విశాలమైన ఆటస్థలం, ఉచితపాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు శ్రీదేవి, నారాయణరెడ్డి, రాజు, శ్రీనివాస్ గౌడ్, అనూరాధ, రాజేష్ బాబు, సాయి రేణు, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, భాస్కర్, శేఖర్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందజేసి విద్యా సంవత్సరానికి శుభారంభం పలికారు.

# ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

**తొర్రూరు, (సింగిడి):**
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవం ఉన్న అధ్యాపకులు పాఠాలు బోధిస్తారని, ఉద యం అల్పాహారం, మధ్యాహ్న భోజనం కళాశాలలో అందుతుందన్నారు.

# కలెక్టరేట్ ముందు ఎప్పుడూలేని ఆంక్షలు కొత్తగా ఎందుకోసం?

**-జిల్లా అధికారుల అవినీతి బాగోతం బయటపెడతామంటే ఎందుకంత ఉలికిపాటు..!**
**-పోలీసుల అండతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరు**
**-బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుల వెంటే పోలీసుల పహారా దేనికోసం**
**-బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**





**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** జిల్లా అధికారులు ఎలాంటి తప్పు చేయకపోతే ఎందుకు భయప డుతున్నారని, ఎప్పుడు లేని విధంగా కలెక్టరేట్ ముందు పదుల సంఖ్యలో పోలీస్ బందోబస్తు దేనికోసం ఏర్పాటు చేశారని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి కుంభకోణంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేయాలనుకోవడం అవివేకమేనని అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు కలెక్టరేటుకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో జిల్లా అధికారులు కలెక్టరేట్ లో ఎప్పుడు లేనివిధంగా పోలీసుల పహారా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. తాము ఎటు వెళ్తే అటు పోలీసులను వెంట తిప్పుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిప డ్డారు. తాము దేశద్రోహులమో లేక తీవ్రవాదులమో కాదని, జిల్లా అధికారుల అవినీతి బాగోతం బయటపెడతామంటే ఎందుకంత ఉలిక్కి పాటు అంటూ పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అవినీతితో చెలరేగిపోతామంటే చూస్తూ ఊరుకోమని, జిల్లా అధికారుల అవినీతి బాగోతంపై ఢిల్లీలో ఫిర్యాదు చేస్తామని, అదేవిధంగా మంగళవారం హైదరాబాదులో నిర్వహించే ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వచ్చే సోమవారం లోపు డిఎస్ఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే వందల సంఖ్యలో రైతులను సమీకరించి కలెక్టరేటును ముట్టడించే కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 20-6-2026

# ఎల్‌పీజీ ధరల పెంపుపై కాంగ్రెస్ భారీ నిరసన

**ఖాళీ సిలిండర్లు, కట్టెల పొయ్యితో వినూత్న ఆందోళన.. కేంద్రం వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్**

**ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** కేంద్రంలోని ఎన్డీఏ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇటీవల ఎల్‌పీజీ గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖాళీ గ్యాస్ సిలిండర్లు, నిరసన ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నాయకులు వినూత్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ ధరలను కూడా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. ఎన్నికల అనంతరం ధరల పెంపు జరుగుతుందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముందుగానే హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఒకవైపు అభివృద్ధి గురించి మాట్లాడుతూనే మరోవైపు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. 2014లో సుమారు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,200 దాటిందని, సబ్సిడీలను తొలగించడం వల్ల సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఉజ్వల పథకం లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ ఎంపీలు పెరుగుతున్న ధరలపై స్పందించాలని, ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు తగ్గించి పాత సబ్సిడీ విధానాన్ని పునరుద్ధరించాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం నేతృత్వంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యుల భద్రతకు చర్యల కమిటీ ఏర్పాటు

**పోలీసు శాఖతో సమన్వయం పెంపునకు భారత వైద్య సంఘం ముందడుగు**

**డా. బి.ఎన్. రావుపై జరిగిన దాడిపై ఐఎంఏ ఖండన**

**వైద్యులకు తగిన రక్షణ కల్పించాలి: ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,డా. కిషన్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డా ఆకుల శైలజ**




**కరీంనగర్, (సింగిడి)** వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, రోగులు, ఆసుపత్రుల భద్రతను బలో పేతం చేయడానికి భారత వైద్య సంఘం (ఐఎం ఏ) కరీంనగర్ శాఖ చర్యల కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్రశాఖ సూచనల మేరకు ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు ఐఎం ఏ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి. కిషన్ నాయ కత్వంలో, కరీంనగర్ శాఖ అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, గౌరవ కార్యదర్శి డా. ఎన్. మహేష్‌బాబు తదితరులు పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వైద్య వర్గాలు--పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఆసుపత్రుల్లో హింసాత్మక ఘటనలు, శాంతిభద్రతల సమస్యలు, వైద్య-న్యాయ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో చర్యల కమిటీ పోలీసు అధికారులతో సమన్వయం చేస్తూ పనిచేస్తుందని తెలిపారు. అలాగే ప్రతి పోలీసు స్టేషన్ స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, క్రమానుగత సమీక్షా సమావేశాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై పెరుగుతున్న దాడులు ఆందోళనకరమని పేర్కొన్న ఐఎంఏ నాయకులు, ఇటీవల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డా. బి.ఎన్. రావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్రంలోని వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.
వన్ హాస్పిటల్ ఓనర్ మహేశ్వర్ రెడ్డి కి ఐఎంఏ లో సభ్యత్వం లేదు హాస్పిటల్ యాక్షన్ ఫోర్స్ కమిటీ లేదని స్పష్టం చేశారు. ప్రైవేటు భద్రతా బలగాల ఏర్పాటును తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్స హించబోమని స్పష్టం చేసిన ఐఎంఏ కరీంనగర్, అన్ని సమస్యలను చట్టబద్ధమైన, శాంతియుత మార్గాల్లోనే పరిష్కరిం చాలనే తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు చట్టాల పట్ల గౌరవాన్ని పాటిస్తూ అన్ని వర్గాలతో సత్సంబంధాలు కొనసా గిస్తామని పేర్కొంది. ఈ విలేకరుల సమావేశం లో డా బిఎన్ రావు,డా ఎనమళ్ళ నరేష్, డా వెంకటేశ్వర్లు, డా నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి: సర్పంచ్ సంపత్



**హుస్నాబాద్, (సింగిడి):** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గాంధీ నగర్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పోలు సంపత్ కోరారు. హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో సర్పంచ్ పోలు సంపత్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు హుస్నాబాద్ మండల ఎంఈఓ మనీల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నివాసాల చుట్టుపక్కల వర్షపు నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా తగిన చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి..**
అనంతరం ఎంఈఓ మనీల మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, విద్యార్థుల సంఖ్యను పెంచేలా గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన...**
వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారి పూజ ఈ సభలో సూచించారు. ముఖ్యంగా నీటి లభ్యతను బట్టి వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోచవేని శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి శ్రేయ, జీపీఓ రజిత, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి..

**కరీంనగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన. .మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్, (సింగిడి):** ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్పీజీ గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సోమవారం కరీంనగర్‌లో జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు పిలుపుమేరకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు నివాసం నుంచి గీత భవన్ చౌరస్తా వరకు ఆకుల నర సన్న నాయకత్వంలో కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా చౌక్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుల నరసన్న మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్యాస్ సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయడం వల్ల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఊరటనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గంట శ్రీనివాస్ భాస్కర్ నాయక్ పడాల శ్రీజ అజయ్ మాజీ కార్పొరేటర్లు ఆర్ష మల్లేశం, గంట కళ్యాణి మీసా రమాదేవి, ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజన్న కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ పంజాల శ్రీనివాస్, సంపత్, గసికంటి కుమార్ గండి రాజేశ్వర్, గండి శ్యామ్ గండి గణేష్ వెలిచాల రాజేందర్ రావ్ యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్ కనకరాజు, బోనాల అశోక్, పొరండ్ల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్తికి లక్ష్మీనారాయణ పత్తికి రాజేష్ మూల కృష్ణారెడ్డి మీసాల శంకర్ చల్ల మల్లారెడ్డి అశోక్ రెడ్డి, కర్రె పావని, మాలోతు మహాలక్ష్మి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్ తనిఖీలు



**బుగ్గారం, (సింగిడి)** బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం సీడ్ టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పత్తి విత్తనాలు బిటీ-3, హెచ్.టి విత్తనాలు అమ్మినట్లయితే చర్యలు తీసుకోబడునని తెలిపారు. విత్తనాల స్టాక్ బిల్లు బుక్, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏ గ్రామంలోనైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించినట్లయితే విక్ర యించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడు నని హెచ్చరించారు. అలాగే నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు రైతుల కు ఎల్లప్పుడూ నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత రసీదులు తప్పకుండా ఇవ్వాలని విత్తన డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ మండల వ్యవసాయ అధికారిని అక్షిత పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**బెస్ట్ అవైలబుల్ స్కీమ్ సీట్ల కేటాయింపును నిలిపివేయాలి : యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు**




**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంటలోని మాస్టర్స్ స్వామి వివేకానంద పాఠశాలలో చోటుచేసు కున్న ఘటనలు, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలనీ, 2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద సీట్ల కేటాయింపును నిలిపివేయా లని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో బెస్ట్ అవైలబుల్‌స్కీమ్ ద్వారా సుమారు100 మంది విద్యార్థులు చదువుతున్నప్ప టికీ, ప్రభుత్వం కల్పించా ల్సిన పుస్తకాలు, బ్యాగులు తదితర సౌకర్యాలు అందిం చకుండా వారి తల్లిదండ్రుల నుంచే డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 4న పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు 9వతరగతి విద్యార్థులు యాజమాన్య వేధింపుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సామాజిక సంక్షేమ, బాలల సంక్షేమ శాఖ అధికారులు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒక బాలికపై పాఠశాల యాజ మాన్యానికి చెందిన వ్యక్తులు లైంగిక వేధింపులకు పాల్పడ్డా రంటూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయాన్ని కూడా ఫిర్యా దులో ప్రస్తావించారు. ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ సం బంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోలేదని నాగరాజు ఆరోపిం చారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే విచారణ చేపట్టి పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద కొత్త సీట్ల కేటాయింపును నిలిపివేయాలని కలెక్టర్‌ను కోరారు.

# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

**కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం అప్రెంటిస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాం నూతన కోర్సులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలపారు. జమ్మికుంట పట్టణంలో సోమవారం అడ్మీషన్ల కోసం ప్రచారం చేశారు. అలాగే పట్టణంలో జరుగుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వార్డు సమావేశాలకు ప్రిన్సిపాల్ తో పాటు, కళాశాల అధ్యాపక బృందం హాజరయ్యారు. ఈ విద్యాసంవత్సరం అడ్మీషన్ల వాల్ పోస్టర్లు, నూతన కోర్సు బీకాం రిటైల్ ఆపరేషన్స్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఏ ఈ డి పి నూతన కోర్సు బీకాం రిటైల్ ఆపరేషన్స్ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైందన్నారు . ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మెరుగైనా ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఫైనల్ ఇయర్ లో అప్రెంటిస్ షిప్ ఉంటుందని, అప్రెంటిస్ సమయంలో ప్రతి నెల 8 వేల రూపాయల స్టైపెండ్ వస్తుందన్నారు. అప్రెంటిస్ షిప్ రాష్ట్రంలో ఎక్కడా చేసిన స్టైపెండ్ వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులకు కళాశాలలో ఉచితంగా అడ్మీషన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరి కళాశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ బచ్చు మాధవి, 7వ వార్డు కౌన్సిలర్ ఎండి ఫిరోజ్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్. ఓదెలు కుమార్, అకాడమిక్ కో - ఆర్డినేటర్ డా.కే. రాజేంద్రం, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.కే. గణేష్, డా. శామల, డా. మాధవి, కె. ఉమాకిరణ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# రజక సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యం



**మల్యాల, (సింగిడి):** మండలంలోని ముత్యంపేట గ్రామంలో రూ: 5 లక్షలతో నూతనంగా నిర్మించిన రజక సంఘ భవనాన్ని సోమవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. సందర్భంగా స్థానిక సర్పంచ్ దారం ఆదిరెడ్డి, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామలింగారెడ్డి ,పార్టీ సీనియర్ నాయకులు వీరబత్తిని శోభారాణి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ల సతీష్ రెడ్డి, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరస్వామి ఆలయంలో సామాజిక భవన నిర్మాణానికి శ్రీకారం

**భక్తులు, స్థానికుల సౌకర్యార్థం ఆధునిక వసతులతో భవనం ఏర్పాటు**

**ఉప మేయర్, యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని 42వ డివిజన్‌లో ఉన్న చారిత్రక కపిలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు, స్థానికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న సామాజిక భవన పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఉప మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్త సామాజిక భవనం నిర్మాణంతో ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీ చంద్రమౌళి, ఆలయ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, కనకయ్య, శంకరయ్య, ఆలయ ప్రధాన అర్చకులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# రైతు సమ్మేళనంను విజయవంతం చేయండి

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



**జమ్మికుంట,(సింగిడి):** రైతాంగానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం కోసం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 11న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . సోమవారం జమ్మికుంటలో స్థానిక బిజెపి నేతలతో రైతు సమ్మేళన కార్యక్రమం నకు కు సంబంధించి సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జమ్మికుంటలో జరిగే రైతు సమ్మేళన కార్యక్రమానికి కేంద్రమంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో కేవీకే సైంటిస్ట్ ప్రశాంతి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు వెంకటరమణ రెడ్డి, హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, కొండల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, ఓజ్జా శ్రీనివాస్, పుప్పాల రఘు, కైలాసకోటి గణేష్, ప్రశాంత్, ఆడువాల శ్రీధర్, కౌన్సిలర్లు కొలకాని రాజకుమారి, తుర్పాటి చందన-శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలతో నీటివృధాను అరికట్టొచ్చు..



**పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం**

**ప్రజాపాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు**


**సమస్యల పరిష్కారమే వార్డు సభల లక్ష్యం**

**మున్సిపల్ చైర్మన్, ప్రశాంత్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున స్వామి**

**జమ్మికుంట, (సింగిడి):** వర్షాకాలంలో నీటి వృధాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మిం చుకోవాలని సంపూర్ణమైన ఆరోగ్యం కోసం పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జమ్మి కుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 7,22,27,30, వార్డు సభలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99 రోజుల కార్యా చరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వార్డు సభల ద్వారా వార్డులో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. వార్డు సభలు నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశం మీ సమస్యలను నేరుగా మా దృష్టికి తీసుకురా వడం వల్ల సమస్యకు పరిష్కా రం లభిస్తుందని అలాగే వార్డుల్లో నెలకొన్న సమస్యల ను ప్రత్య క్షంగా చూసి ఆ సమస్యను పరిష్కరించడానికి పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. అనం తరం సభకు హాజరైన పలువురు మహిళలు తమకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయా లని పింఛన్లు రావడం లేదని డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని తెలపగా అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అంది స్తామని హామీ ఇచ్చారు. 30వ వార్డులో జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్ చందా రాజు వార్డు ఆఫీసర్ శ్రీవర్షిని తోపాటు మున్సిపల్ సిబ్బంది హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి**

మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో నిర్వహించిన వార్డు సభలో మున్సిపల్ కమిష నర్ మల్లికార్జున స్వామి కౌన్సిలర్ ఫిరోజ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ,ఏడవవార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంని దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిలువలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూ చించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని డ్రైనేజీలలో చెత్తను వేయరాదని ముఖ్యంగా ప్లాస్టిక్‌బాటిల్స్ కవర్లను వేయడం వల్ల డ్రైనేజీ మూసుకొని పోయి నీరు ఎక్కడికి అక్కడే ఆగి పోతుందని తద్వారా దుర్గంధం వెదజల్లుతుందని దానితోపాటు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుం ్వుతాయని వారికి సూచించారు. మున్సిపల్ సిబ్బందికి చెత్తను అందించి సహకరించాలని రోడ్లపై చెత్తను వేయరాదని సూచించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు వార్డు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**ప్రత్యేక వార్డు సభలో మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే సభ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత పథకాలు వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, వినతులను అధికారులు ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న మేయర్, ప్రతి వార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సిమెంట్ రహదారులు, మురు గునీటి కాలువలు వంటి మౌలిక వసతుల కల్ప నకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల భాగస్వామ్యంతో నిర్మించిన ద్విగృహ నివాసాలను గతంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. అర్హులను గుర్తించి త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపా రు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిం చాలని పిలుపునిచ్చారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్, లక్ష్మీనగర్ 11వ బాధ్యతల స్వీకారోత్సవం

**నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించిన పీడీజీ చిదుర సురేష్**




**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లోని మైత్రి హోటల్‌లో జూన్ 7న లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ లక్ష్మీనగర్ 11వ బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ పెద్ది రఘునాథ్, కార్యదర్శిగా లయన్ బొలుసాని లక్ష్మణ్, ఖజాంచిగా లయన్ రాచమల్ల శ్రీనివాస్‌తోపాటు నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా గవర్నర్ లయన్ చిదుర సురేష్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి విస్తరణ కమిటీ చైర్మన్ లయన్ అలగందుల మునీందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కొంజర్ల నవీన్ కుమార్, ప్రాంతీయ చైర్‌పర్సన్ లయన్ ఎల్. బోయినపల్లి సరళ, మండల చైర్‌పర్సన్‌లు లయన్ తనుగుల అనిల్ కుమార్, లయన్ కాముని తిరుమలేష్ గుప్తా, అధ్యక్షుడు లయన్ గిల్లా వేణుగోపాల్, లయన్ దిడిగె సంతోష్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్లబ్ సభ్యులందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# దుబాయి ప్రమాద బాధితులకు రూ.2.60 కోట్ల సాయం

**బుర్జీల్ ప్రతినిధులను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. డా. షంషీర్ వయలిల్‌కు కృతజ్ఞతలు**



**కరీంనగర్, (సింగిడి):** దుబాయిలో జీవిల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికుల కుటుంబాలు, గాయపడిన తొమ్మిది మందికి మొత్తం 10 లక్షల దిర్హంలు (సుమారు రూ.2.60 కోట్లు) మానవతా సహాయ ప్యాకేజీ ప్రకటించిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డా. షంషీర్ వయలిల్‌కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన సంస్థ ప్రతినిధులు ఎ. విజయ్ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఎం. ఉన్ని కృష్ణన్, డా. పంకజ్‌కుమార్ భట్‌లను శుక్రవారం దుబాయిలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డా. షంషీర్ వయలిల్‌తో పాటు బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులు అందజేయాలని ప్రతిపాదించారు. ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందినవారు కాగా, ప్రతి కుటుంబానికి లక్ష దిర్హంలు (సుమారు రూ.26 లక్షలు) చొప్పున అందించనున్నారు. గాయపడిన వారికి వైద్య చికిత్స, పునరావాసం, అలాగే ప్రభావిత కుటుంబాల పిల్లల విద్యకు కూడా సహాయం అందించనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దుబాయిలోని భారత రాయబార కార్యాలయ అధికారులను కలిసి మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం రాషిద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రవాస భారతీయుల సలహా కమిటీ సభ్యుడు కొట్టాల సత్యం గౌడ్‌తో పాటు పలువురు తెలంగాణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పాఠశాల కోసం గ్రామస్తులతో టిఫిన్ సమావేశం

**ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు సహాయం ప్రకటించిన కేంద్ర మంత్రి**

**సిరిసిల్ల టౌన్ లోని ఉన్నత పాఠశాలను 'క్లీన్' చేయనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, (సింగిడి):** కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ ఉన్నత పాఠశాలను సందర్శించారు. "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణలో టిఫిన్ సమావేశంలో పాల్గొన్నారు. అందరూ తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న అల్పాహారాన్ని కలిసి భుజిస్తూ పాఠశాల పరిశుభ్రత, అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బండి సంజయ్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న ప్రతి గ్రామంలో విద్యార్థుల బడి ప్రవేశోత్సవ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనశాల సౌకర్యం లేదని, సమీప ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని ఉపాధ్యాయులు వివరించగా, ఉన్నత పాఠశాలలో భోజనశాల ఏర్పాటుకు రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణంతో పాటు కుల సంఘాల భవనాల కోసం రూ.20 లక్షల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలి విడతగా రూ.10 లక్షలు విడుదల చేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, భోజనశాలను పరిశీలించిన బండి సంజయ్ విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచిత సైకిళ్లు అందజేస్తామని ప్రకటించారు. మరోవైపు ఆయన పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అనేక గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాఠశాలల్లో టిఫిన్ సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల పరిస్థితిని పరిశీలించి, వాటి పరిశుభ్రత కోసం కార్యాచరణ రూపొందించారు. శనివారం ఉదయం ఆయా గ్రామాల్లోని పాఠశాలలను స్వయంగా శుభ్రపరిచేందుకు సిద్ధమయ్యారు. ఇక "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగంగా బండి సంజయ్ సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనా విజయాలను వివరిస్తూ ప్రముఖ వ్యక్తులకు పుస్తకాలను అందజేయనున్నారు.

# శివాలయంలో మహిళల ప్రత్యేక పూజలు



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంటలో అతి పురాతనమైన శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అధిక జ్యేష్ఠమాస, పురుషోత్తమ మాసం సందర్భంగా గత నెల రోజులుగా అన్నపూర్ణ సేవా సమితి భవాని భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి నిత్యం ప్రదోషకాలంలో అమ్మవార్లకు లలితా సహస్ర పారాయణము, విష్ణు సహస్ర పారాయణము కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఈ ఈనెల 15న సోమవతి అమావాస్య సందర్భంగా మహిళల చేత అమ్మవారికి లక్ష కనకాంబరం పూలతో అర్చన, లలిత సంపుటి పారాయణం విష్ణు సహస్ర పారాయణము ప్రధాన అర్చలు వేణుగోపాల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడును. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## మనబడి, మనబాధ్యత..
# స్వచ్ఛ పాఠశాల' ఏర్పాట్ల పరిశీలన

**భగత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో**

**పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లపై సమీక్ష**

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి)** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న 'మన బడి – మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు శుక్రవారం పరిశీలించారు. కరీంనగర్ 42వ డివిజన్ భగత్‌నగర్ పోలీసు క్వార్టర్స్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, పాఠశాలల పరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసి, స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కన్నమల్ల శ్రీనివాస్, భీమరి సత్యం, రాజ్ ప్రభాకర్, రమేశ్ గౌడ్, డోలి ఉపేందర్, వర్ధినేని వెంకట్‌రావు, అనుదీప్, కుంభం అనిల్‌కుమార్, గీకురు ఆంజనేయులు, దాసరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో వర్షాకాల సన్నాహక చర్యలువేగవంతం

**హుజూరాబాద్,(సింగిడి):** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై మున్సిపాలిటీ కమిషనర్ బి. కిషన్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం పట్టణంలోని కె.సీ క్యాంపు, ఇప్పల్ నర్సింగాపూర్ ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీ నర్సరీలను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో పట్టణ వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇప్పల్ నర్సింగా పూర్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం 2.0) నిధులతో నిర్మాణ దశలో ఉన్న వే-బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే స్థానిక అవంతీ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని వరద నీటి కాలువను పరిశీలించి, కాలువను శుభ్రపరచడంతో పాటు వరద నీటి ప్రవాహాన్ని చిలుకవాగులోకి మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జి. అభినవ్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీకాంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి. వినయ్, శానిటరీ జవాన్ ప్రతాప్ రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ముక్దంపూర్‌లో గొర్రెలు, మేకలకు గాలి టీకాల కార్యక్రమం

**పశుసంవర్ధక శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాపరులు, రైతులకు పిలుపు**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ రూరల్ మండలంలోని ముక్దంపూర్ గ్రామంలో గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు బండి మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గొర్రెలు, మేకలకు గాలి టీకాలు వేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గొర్ల కాపరులు, రైతులు పశు సంవర్ధక శాఖ అందిస్తున్న టీకా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని యాదవ సంఘం అధ్యక్షులు బండి మల్లయ్య యాదవు కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్ భారతి, పశుసంవర్ధక విస్తరణ అధికారి పి. రజిత, గ్రామ గొర్ల కాపరుల ప్రధాన కార్యదర్శి దాడి పెద్ద లచ్చయ్య యాదవ్, చిన్న లచ్చయ్యతో పాటు గొర్ల కాపరులు, రైతులు పాల్గొన్నారు.

# నీట్, ఐఐటీ పరీక్షల అవకతవకలు దేశ ప్రతిష్ఠకు మచ్చ

**ఐఐటి, నీట్ పరీక్షల్లో అవకతవకలపై భారీ నిరసన**

**కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించాలి: నీట్, ఐఐటి పేపర్ లీకేజీలపై నరేందర్ రెడ్డి డిమాండ్**

**కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలి: అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ఫైర్**

**కరీంనగర్, (సింగిడి):** ప్రతిష్ఠాత్మక నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలు దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. నీట్, ఐఐటీ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలను నిరసిస్తూ కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు, పర్యవేక్షణ కొరత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన పరిస్థితి రావడం అత్యంత అవమానకరమని పేర్కొన్నారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ కావడం, ప్రశ్నల్లో పొరపాట్లు వెలుగులోకి రావడం చరిత్రలోనే తొలిసారని, దీనివల్ల భారత విద్యా వ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతిందని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ పదో, ఇంటర్మీడియట్ సమాన తరగతుల ఫలితాల ప్రక్రియలోనూ లోపాలు ఉన్నాయని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న నిర్లక్ష్యం దేశ అభివృద్ధిపైనా ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డా. నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఎం.డి. ఇమ్రాన్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహద్, గుర్రం వాసు గౌడ్, రెహమాన్, రమేష్, విక్రమ్, ఎండీ అయాన్, సిహెచ్ చేతన్ రెడ్డి, సోఫియాన్, అన్సారీ, అనిల్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.




# క్యాన్సర్‌కు చికిత్సతో పాటు
# రోగి మనోధైర్యం కీలకం

**యశోద ఆసుపత్రిలో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతతో చికిత్స**

**ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**



**కరీంనగర్, (సింగిడి)** క్యాన్సర్‌ను జయించడంలో వైద్య చికిత్సతో పాటు రోగిలో ఉండే మనోధైర్యం అత్యంత కీలకమని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, యశోద ఆసుపత్రి రేడి యేషన్ ఆంకాలజీ విభాగంలో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతను అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సదుపాయం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతాన్ని అత్యంత ఖచ్చితంగా గుర్తించి, ఆ భాగానికే కిరణ చికిత్స అందించడంతో ఆరోగ్యకరమైన అవయవాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయని వివరించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆసుపత్రి తరపున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. హైపర్‌సైట్ సాంకేతికతతో ఇప్పటికే పలువురు రోగులకు విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. కరీంనగర్‌తో పాటు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశం లో యశోద ఆసుపత్రి ప్రతినిధులు శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడి వద్దు సర్కారు బడి ముద్దు..

**బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్**



**జమ్మికుంట, (సింగిడి)** ప్రైవేటు పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో కోరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయ బృందం కోరపల్లి సర్పంచ్ మధుసూదన్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన లభిస్తుందని గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పౌష్టిక ఆహారం ప్రతిరోజు గుడ్లు, రాగి జావా తో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని ఇవే విద్యార్థులకు నోటు పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా కరాటే శిక్షణ అందించడం జరుగుతుందని ఐఎఫ్ఎస్సి కోడ్ సహాయంతో కంప్యూటర్ విద్యను అందించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజయ్య పెండెం శ్రీనివాస్ కుమారస్వామి విజేందర్‌రెడ్డి క్రాఫ్ట్ టీచర్ శ్రీమాన్ సిఆర్పి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక

**జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విశిష్ట, నిహారికకు రాష్ట్ర స్థాయిలో పోటీ చేసే అవకాశం**



**కరీంనగర్, (సింగిడి):** స్థానిక పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె. విశిష్ట, ఎ. నిహారిక రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా బాక్సింగ్ క్రీడా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాక్సింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి కె. విశిష్ట (64--67 కిలోల విభాగం), 8వ తరగతి విద్యార్థిని ఎ. నిహారిక (46--49 కిలోల విభాగం) విశేష ప్రతిభ కనబరిచారు. దీంతో వీరు జూన్ 13న హైదరాబాద్‌లోని ఆలే నరేంద్ర క్రీడా సముదాయంలో తెలంగాణ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగే 5వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు బాక్సింగ్ శిక్షకుడు ఎ. రామకృష్ణను అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ శుభాకాంక్షలు తెలిపారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును బహిష్కరించండి..

**నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఏం చేశాడో నిలదీయండి**

**కాంగ్రెస్ నేత తిప్పారపు సంపత్**



**జమ్మికుంట, (సింగిడి)** హుజురాబాద్ నియోజకవర్గం లో టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజలు బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నేత తిప్పారపు సంపత్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ట్రిబుల్ షూటర్ గా చెప్పుకునే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు శుక్రవారం జమ్మికుంట పట్టణంలో టిఆర్ఎస్ ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చాడో ఏం అభివృద్ధి చేశారో ప్రజలు నిలదీయాలని కోరారు. మోసపూరితమైన మాటలు మాట్లాడి కుటుంబాన్ని అడ్డం పెట్టుకొని గెలిచిన వ్యక్తి కౌశిక్ రెడ్డి అని అన్నారు. సొంత పార్టీ నేతలే మీటింగులు పెట్టి కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని అలాంటి వ్యక్తిని హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు మళ్లీ గెలిపిస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేసి సోషల్ మీడియాలో హీరోలాగా ఫీల్ అవుతున్నాడని ఇలాంటి నాయకుడు ఏ నియోజకవరానికి ఉండొద్దని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారని సంపత్ తెలిపారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్తే అక్కడ ఆ పార్టీ ఓటమిపాలవుతుందని గతంలో అతను వెళ్ళిన దుబ్బాక ఉప ఎన్నిక పంపితే అక్కడ రఘునందన్ రావు ఎలా గెలిచాడో మంత్రి హరీష్ రావు తెలపాలని ఉన్నారు. హుజరాబాద్ ఉప ఎన్నిక సమయంలో కూడా హరీష్ రావును ఇన్చార్జిగా నియమిస్తే ఇక్కడ ఈటెల రాజేందర్ గెలిచారని వచ్చే ఎన్నికల్లో కూడా కౌశిక్ రెడ్డికి ఓటమి తప్పదని ఆయన జోష్యం చెప్పారు. కౌశిక్ రెడ్డి అరాచక పాలనను నియోజకవర్గ ప్రజలు తిరస్కరిస్తున్నారని రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదని ఆయన పేర్కొన్నారు.

# మన బడి, మన బాధ్యత కార్యక్రమానికి ముమ్మర ఏర్పాట్లు

**ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్, (సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న "మన బడి--మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమానికి సంబంధించి కరీంనగర్ నగరపాలక సంస్థ 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించిన మేయర్ పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యం, ద్యాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. శనివారం రోజున జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసిన మేయర్, స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి**





**హుజురాబాద్,(సింగిడి):** కేంద్రహోంశాఖసహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 13న నిర్వహించనున్న "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాఠశాలల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రజలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, పాఠశాలల పరిశుభ్రత మరియు అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. సమాజంలోని ప్రతి వ్యక్తి పాఠశాలల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తే భావితరాలకు మెరుగైన విద్యా వాతావరణం అందించగలమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, టిఫిన్ బైఠక్ కన్వీనర్ తిప్పబత్తిని రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, మాజీ కౌన్సిలర్ నల్ల సుమన్, సీనియర్ నాయకులు సబ్బని రమేష్, కొలిపాక శ్రీనివాస్, నారాల రాజశేఖర్, అంకటి వాసు, బోరగాల సారయ్య, కొడిమ్యాల పవన్, మోటపోతుల రాకేష్, కొలుగూరి అనిల్, కొలిపాక వెంకటేష్, క్యాస్ వెంకటేష్, నీలం రవీందర్, గంధం సంతోష్, పర్దం విజయ్, అనంతుల విక్రం తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి)** :బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాధన సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ విడుదల చేయడం సంతోషకరమని, ఈ పోస్టర్ ఎందరికో అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ సిబ్బంది మధుసూదన్, వినేష్ కుమార్, నిరీక్షణ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను ప్రోత్సహించకూడదు..

**డీఎల్ఎస్ఏ సుబేధర్ రాజ్‌కుమార్**

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** బాల కార్మికులను ప్రోత్సహించకూడదని, బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్ఎస్ఎ సుభేదర్ రాజ్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ బాల కార్మికుల వ్యతిరేఖ దినోత్సవ సందర్భంగా సాధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ చౌక్ లేబర్ అడ్డా ప్రాంతంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఎ సుబేధర్ రాజ్ కుమార్, మాణిక్యం పాల్గొని బాలలను వివిధ పనిలో పెట్టుకునే యజమానులపై ప్రభుత్వం విధించే శిక్షల గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సాధన సిబ్బంది మధుసూదన్, వినేష్ కుమార్, నిరీక్షణ, డీఎల్ఎస్ఎ సిబ్బంది, 250 పైగా లేబర్స్ పాల్గొన్నారు.





# బాలకృష్ణ మూవీలో కాజల్

## ఫస్ట్‌లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

*నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది.*

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు 22న విచారణకు రావాలని అల్లు అర్జున్‌కు సమన్లు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. జూన్ 22న సోమవారం వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చిక్కడపల్లి పోలీసులు చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని 1 నుంచి 10వ నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 19 మందికి కోర్టు సమన్లు జారీ చేయగా, 23 మందిపై ఇప్పటికే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' ప్రీమియర్ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ లీగల్ టీమ్ స్పందిస్తూ, సోమవారం జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ విషయంపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం అని తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన వివిధ వ్యక్తులు, సంస్థల పాత్రలు, బాధ్యతలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోమవారం జరగనున్న విచారణ ఈ కేసులో కీలక పరిణామంగా మారనుంది.

# ధనుష్ తాజా చిత్రం ఓం



తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.














# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి.ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. పస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737